PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 166 | విజయవాడ, శనివారం 18 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 18 January 2025 | Rs

ఆందోళనలో మధ్య తరగతి

- వినిమయం పడిపోతోంది
- వృద్ధి మందగిస్తోంది
- ఆర్థిక వ్యవస్థపై రఘురాం రాజన్ విమర్శలు

3



ఖేల్‌రత్న అవార్డులు అందుకున్న మను, గుకేశ్, హర్మన్, ప్రవీణ్

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్పోర్ట్స్ అవార్డుల ప్రదానం

8

రూ.11,440 కోట్ల ప్యాకేజి

- విశాఖ ఉక్కుపై కేంద్ర మంత్రి కుమారస్వామి
- ఇది శాశ్వత పరిష్కారం కాదు : కార్మిక సంఘాలు
- సొంత గనులు లేవు.. సెయిల్‌లో విలీనం లేదు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేందుకు, సెయిల్‌లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. ప్యాకేజీ పేరుతో రూ.11,440 కోట్లు విదల్చనుంది. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి శుక్రవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,.ఈ ప్యాకేజీలో రూ.10,300 కోట్లు పెట్టుబడిలో భాగంగా పెడతామని, మిగిలిన రూ.1,140 కోట్లను వర్కింగ్ క్యాపిటల్ లోన్‌లో ప్రాధాన్యత వాటా మూలధనంగా మార్చుతామని చెప్పారు. పత్రికా గోష్టిలో ఆయనతోబాటు కేంద్ర మంత్రులు కె రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ కూడా పాల్గొన్నారు. ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలంటే సొంత గనులు కేటాయింపు,సెయిల్‌లో విలీనం వంటివి చేపట్టాలని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు గత మూడేళ్లుగా ఆందోళన కొనసాగిస్తున్నాయి..

వైజాగ్ స్టీల్ ప్లాంట్ 2014 వరకు మిగతా 7లో

కేంద్రం చేతులు దులుపుకుంటోంది : వి.శ్రీనివాసరావు

కేంద్రప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చి చేతులు దులుపుకుంటోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. కార్మికుల పోరాటానికి తలొగ్గి ప్యాకేజీ ప్రకటించిందని, అయితే ఆ ప్యాకేజీతోనే స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరగదని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు గనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనమే పరిష్కారమని, కానీ ఆ రెండూ చేయకుండా ప్యాకేజీ ప్రకటించిందని అన్నారు. ఇంకా ప్రారంభం కాని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అడగడం, కేటాయించడం జరిగిందని, కానీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఈ ప్యాకేజీ నుంచి కూడా గతంలో వడ్డీలు వసూలు చేస్తారేమోనని అనుమానం వ్యక్తంచేశారు. ఎందుకంటే గతంలో రూ.3,500 కోట్లు నిధులు ఇచ్చి, అందులో రూ.3,000 కోట్లు వడ్డీలని వెనక్కి తీసుకున్నారని, కేవలం రూ.500 కోట్లు మాత్రమే స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లిందని గుర్తు చేశారు.

ఇక ప్రైవేటీకరణ సమస్య రాదు

- ఉద్యమాలు జయప్రదం
- ప్యాకేజికి సమిష్టి కృషే కారణం : సిఎం చంద్రబాబు

2

ప్యాకేజీతో స్టీల్ సమస్య పరిష్కారమైనట్లు కాదు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

- అదే రోజు ఆర్థిక సర్వే
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు విడతలుగా జరిగే ఈ సమావేశాల్లో తొలి విడత ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. రెండో విడత సమావేశాలు మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరుగుతాయి. పార్లమెంటు సమావేశాల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 31న పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. అదేరోజు ఆర్థిక సర్వేను ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 1న 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెడతారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఫిబ్రవరి 5న, రవిదాస్ జయంతి నేపథ్యంలో ఫిబ్రవరి 12న పార్లమెంటు కార్యకలాపాలకు సెలవు ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభల్లో చర్చ జరుగుతుంది. అనంతరం ఈ చర్చకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెబుతారు. కేంద్ర బడ్జెట్‌పై ఉభయ సభల్లో చర్చ జరగనుంది. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం ఇస్తారు.

ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ కేంద్రంగా ఎలాంటి ప్రకటనలు బడ్జెట్‌లో ఉండకూడదని ఎన్నికల సంఘం కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఏడాది చివరిలో బీహార్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఆ రాష్ట్రానికి కేటాయింపులు పెంచవచ్చని అక్కడ అధికారంలో ఉన్న బిజెపి మిత్రపక్షాలు జెడి (యు), లోక్‌జనశక్తి (రామ్‌విలాస్) పార్టీలు ఆశిస్తున్నాయి. వక్ఫ్ (సవరణ) బిల్లు - 2024పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ పార్లమెంట్‌లో నివేదికను సమర్పించే అవకాశముంది.

'ఆ'భూములపై సమగ్ర అధ్యయనం

నిషేధిత జాబితా నుండి తొలగింపుపై మంత్రివర్గ ఉపసంఘం

- జిల్లా స్థాయిలోనూ కమిటీలు
- మరో 63 అన్న క్యాంటీన్‌లు
- సచివాలయాల విభజన
- కేబినెట్ నిర్ణయాలు



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయంలో నిషేధిత జాబితా నుండి తొలగించిన భూములపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిషేధిత జాబితాలో 13.59లక్షల ఎకరాల భూములుండగా, అందులో సగం భూములను గత ప్రభుత్వం ఆ జాబితా నుండి తొలగించిందని గతంలోనే అధికారులు ప్రభుత్వానికి నివేదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ భూములను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర స్థాయిలో అధ్యయనం చేసేందుకు రెవిన్యూమంత్రి ఛైర్మన్‌గా, పురపాలకశాఖ, గృహ నిర్మాణశాఖ మంత్రులు సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని,జిల్లా స్థాయిలో అధ్యయనానికి ఇన్‌చార్జి మంత్రి ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ , ప్రజాప్రతినిధులు సభ్యులుగా కమిటీని నియమించాలని కేబినెట్ నిర్ణయించినట్లు సమాచారం. ఈ కమిటీలు సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నాయి. మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వివరించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి అక్రమంగా బదిలీచేసిన భూములకు సంబంధించి కొన్ని నిర్ణయాలు చేశామని, వాటిపై మరింత స్పష్టత రావాల్సిఉందని చెప్పారు. "పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్లపట్టాల పంపిణీకి మార్గదర్శకాలను జారీ చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.

'ఈ పథకం కింద లబ్ధి పొందడానికి బిపిఎల్ కుటుంబానికి చెందిన వారై ఉండాలి. గతంలో ఎప్పుడు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద రుణాన్ని పొంది ఉండకూడదు. ఆధార్ తప్పని సరిగా ఉండాలి. మెట్ట భూమైతే 5 ఎకరాలు, మాగాణి భూమైతే 2.5 ఎకరాలుకు మించి ఉండకూడదు.' అని మంత్రి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నివాస యోగ్యం కాని ప్రాంతంలో ఇంటి పట్టాలు ఇచ్చారని, ఆయా స్థలాల్లో నిర్మాణాలు చేపట్టని వారి గృహనిర్మాణ మంజూరు రద్దు చేసి, తిరిగి ఈ పథకం కింద ఇంటి స్థలాలు ఇస్తామని మంత్రి చెప్పారు.

అభ్యంతరాలు లేకుంటే క్రమబద్ధీకరణ

15.10.2019 నాటికి పేదల ప్రభుత్వ స్థలాల్లో నివాసగృహాలు నిర్మించుకుని ఉండి, ఆ భూములపై ఎటువంఇ అభ్యంతరాలు లేకపోతే వాటిని క్రమబద్ధీకరించాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. ఇందుకు సంబంధించి గతంలో జారీ చేసినజీఓలన్నింటినీ సూపర్‌సీడ్ చేస్తున్నట్లు మంత్రి మిగతా 7లో

భూ అక్రమాలపై కఠిన చర్యలకు కొందరు మంత్రుల విముఖత

- కేబినెట్‌లో విస్తృతచర్చ

2



ఆగివున్న బస్సును ఢీకొన్న మినీ వ్యాను

- తొమ్మిదిమంది దుర్మరణం

ముంబై : ఆగివున్న బస్సును మినీ వ్యాను ఢీకొనడంతో ఐదేళ్ల బాలికసహా తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని పూణే - నాసిక్ హైవేపై నారాయణగావ్ వైపు వెళున్న మినీ వ్యాన్‌ను టెంపో శుక్రవారం ఉదయం ఢీకొట్టింది. దీంతో, మినీ వ్యాను అదుపు తప్పింది. రోడ్డుపక్కన ఆగివున్న ఖాళీ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో, వ్యానులో ఉన్న తొమ్మిదిమంది మరణించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పూణే రూరల్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు బ్యాంక్ లూటీ

రూ.12 కోట్లకు పైగా విలువ చేసే ఆభరణాలతో పరార్

మంగళూరు : ఐదారుగురు సాయుధ దుండగులు మంగుళూరు శివార్లలోని ఉల్వాల్ తాలుకా కోటేకర్ బ్యాంక్‌పై పట్ట పగలు దాడి చేసి రూ.10 కోట్ల నుండి రూ.12 కోట్ల విలువ చేసే ఆభరణాలను ఎత్తుకెళ్లారు.. వీరంతా 25 నుండి 35 ఏళ్ల లోపువారే. కోటేకర్‌లోని కెసి రోడ్‌లో గల కోటేకర్ వ్యవసాయ సహకార సేవా సంఘ శాఖ కార్యాలయంలోకి తుపాకులు, కత్తులు, తల్వార్ వంటి ఆయుధాలతో చొరబడ్డారు. ఆ సమయంలో బ్యాంక్‌లో నలుగురైదుగురు ఉద్యోగులు మాత్రమే వున్నారు. భద్రతా సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వీరి పని సులువైంది. శుక్రవారం ఉదయం 11.30-12.30 గంటల మధ్య ఈ లూటీ జరిగింది. పోలీసు కమిషనర్ అనుపమ్ అగర్వాల్ చెప్పారు. కన్నడం, హిందీలో మాట్లాడుతున్న నిందితులు బ్యాంక్ సిబ్బందిని బెదిరించి, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో నిండిన సేఫ్టీ లాకర్లను తెరిపించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం దోపిడీకి గురైన వాటి విలువ రూ.10 కోట్ల నుండి 12కోట్లు వుంటుందని భావిస్తున్నారు. ఆ వెంటనే ఆ సొమ్ముతో వారు నల్లటి ఫియట్ కారులో పారిపోయారని కమిషనర్ చెప్పారు. వారిని పట్టుకునేందుకు, కేసును దర్యాప్తు చేసేందుకు పలు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



దోపిడీకి గురైన బ్యాంక్

సాంకేతిక నిఘాతో వారి ఆచూకీ కనిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోపిడీ వార్త తెలిసిన వెంటనే మంగుళూరులోనే అధికార కార్యక్రమంలో వున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సీనియర్ పోలీసు అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇంతమంది వుంటుండగా ఇదంతా ఎలా జరిగిందని ఆయన ప్రశ్నించారు. టోల్‌గేట్లను మూసివేయకుండా ఎలా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులను పట్టుకునేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. నాలుగు జిల్లాల వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేయాల్సిందిగా ఆదేశించారు. టోల్‌గేట్ల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. స్పీకర్ యుటి ఖాదర్, మంగళూరు ఎమ్మెల్యే ప్రభృతులు బ్యాంక్ కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజికి పరిశీలన బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి

రాజధాని అమరావతి నగర నిర్మాణంలో ప్రపంబ్యాంకు నిర్ధేశించిన సూచికల అమలుతీరు పరిశీలన బాధ్యతలను హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ)కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ (సిఆర్‌డిఎ) విభాగం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి నిర్మాణానికి ఫలితాల ఆధారిత రుణాన్ని ప్రపంచబ్యాంకు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. విడతల వారీగా ఇచ్చే రుణం కోసం ప్రపంచబ్యాంకు నిర్ధేశించే లక్ష్యాలు (షరతులు)ను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అందుకోవాల్సిఉంటుంది. ఈ ప్రక్రియను పరిశీలించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని నిపుణుల కోసం నియమించుకోవాల్సి వుంటుందని కూడా ప్రపంచబ్యాంకు పేర్కొంది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వులలో 'ప్రపంచబ్యాంకు, ఎడిబి నిర్ధేశించిన నిధుల విడుదలకు సంబంధించిన సూచికలు (డిస్‌బర్స్‌మెంట్ లింక్‌డ్ ఇండికేటర్స్) అమలు తీరును పరిశీలించి, నివేదికలిచ్చేందుకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజిని నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ కాలేజి స్వతంత్ర పరిశీలన ఏజెన్సీగా పని చేస్తుందని ఉత్తర్వులలో తెలిపారు.



మతతత్వ శక్తులపై సైద్ధాంతిక పోరు

జ్యోతిబసు సెంటర్ ప్రారంభ సభలో కరత్

7

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా పర్యటనను వ్యతిరేకించండి

రేపు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఈ నెల 19న (ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు వై సాంబశివరావు, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు ఎన్ మూర్తి, ఫార్వార్డ్ బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకులు జానకిరాములు శుక్రవారం ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్‌ను అభిమానించేవారిని ఎగతాళి చేస్తూ, అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆ జనం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అభ్యంతరకరంగా అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయని వారు తెలిపారు.

నిరసనలు వెల్లువెత్తినా కేంద్ర బిజెపి వైఖరిలో మార్పులేదని విమర్శించారు. అన్ని తరగతుల, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజా సంఘాలు బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని కోరారు. ఆదివారం జరగనున్న నిరసన కార్యక్రమాలకు మద్దతునిచ్చి పాల్గొనాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.



పి-4 పద్మవ్యూహం

కార్పొరేట్లకు సులభతర భూపందేరం

- రిస్క్ లేకుండా ల్యాండ్స్ అప్పగించే ఎత్తు
- రైతులకు పెట్టుబడి, వాటాల ఆశ
- అభివృద్ధి, ఉద్యోగాల ఊదర
- ఇదే పి-4 పాలసీ

కెఎస్‌వి ప్రసాద్

పి..4! కొద్దిరోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న మాట ఇది! స్వర్ణాంధ్ర 2047 విజన్ కు చుక్కానిగా, అభివృద్ధికి తారకమంత్రంగా ఆయన పి4ను అభివర్ణిస్తున్నారు. అయితే, ప్రజల భాగస్వామ్యం అంటూ ఊరిస్తున్న మాటల్లో నిజమెంత? భాగస్వామ్యం పేరుతో ఏం జరగనుంది ? అసలీ పి..4 పద్మవ్యూహం ఎవరికోసం? ఎవరికి లాభం... ఎవరికి నష్టం? అసలు విధానపత్రంలో ఏముంది?

ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు 'పి-4' పదాన్ని పరిచయం చేశారు. సదరు పి-4 మోడల్‌ను ప్రతిపాదిత 'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్యాల సాధనకు ఇరుసుగా ఉపయోగిస్తామని పదే పదే వల్లిస్తున్నారు. పి-4 కాన్సెప్ట్‌తో ప్రజల తలరాతలు మారుస్తామని, పేదరికం పూర్తిగా అంతరిస్తుందని, అదొక గేమ్ ఛేంజర్ అని వక్కాణిస్తున్నారు. ఇంతకీ ఆ పి-4 అంటే ప్రజలు (పి) ప్రభుత్వం (పి) ప్రైవేటు (పి) భాగస్వామ్యం (పి). 1998లో తాను తీసుకొచ్చిన 'సంస్కరణ'లలో పి-3ని ప్రవేశపెట్టి అభివృద్ధి, ఉపాధి సాధించామన్నారు సిఎం. అప్పటి పి-3 అంటే ప్రభుత్వ (పి) ప్రైవేటు (పి) భాగస్వామ్యం (పి) ... మూడు 'పి'లు. ఇప్పుడు తెస్తామంటున్నది నాలుగు 'పి'లు. సర్కారు రూపొందించిన పి-4 పాలసీ ఫ్రేమ్ వర్క్‌లో తియ్యటి మాటలు ఎన్ని చెప్పినా ప్రధానంగా భూమి చుట్టూనే తిరుగుతోంది. ఏదైనా ప్రాజెక్టు, పరిశ్రమ పెట్టాలంటే భూమి కావాలి. ఆ భూమిని ప్రభుత్వం సేకరించి ఇవ్వాలి. ప్రభుత్వ భూములపై ప్రభుత్వ పెత్తనం, అజమాయిషీ ఉంటుంది కనుక బలవంతపు భూసేకరణ ద్వారానైనా సేకరిస్తుంది. అదే ప్రైవేటు భూములైతే వాటి యజమానులు, అనుభవభుక్తంలో ఉన్న వారు ఒప్పుకోవాలి. నిర్వాసితులకు చట్ట ప్రకారం నష్ట పరిహారం, సహాయ పునరావాసం కల్పించే బాధ్యత ప్రభుత్వానిది. 2013-భూసేకరణ చట్టం కొంత వరకు భూములు కోల్పోయే వారికి రక్షణగా నిలుస్తుంది. కార్పొరేట్లకు భూమి సేకరించేందుకు రాజ్యాంగం, చట్టాలు, కోర్టులు అడ్డు తగులుతున్నాయని ఇప్పటికే భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) వంటి దొడ్డిదారులను ముందుకు తెచ్చారు. ఆ కోవలోనిదే పి-4. ప్రైవేటు ప్రాజెక్టుల కోసం ప్రజలు తమ భూములను, ఆస్తులను ఇచ్చేయాలి. ఆ పద్ధతికి లీజు, అద్దె అని పేరు పెట్టారు. కానీ వాస్తవంలో రైతులు అనివార్యంగా భూములు కోల్పోతారు. రైతులు తమకు తాముగా ఇష్ట పూర్వకంగా భూములు త్యజించే పద్ధతే పి-4. కాగా



ఈ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌పై ప్రత్యేక పోర్టల్‌ను నెలకొల్పి ప్రజాభిప్రాయం సేకరిస్తామని సిఎం హామీ ఇచ్చారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' డాక్యుమెంట్‌పై లక్షల మంది నుంచి ఆన్‌లైన్‌లో సూచనలు తీసుకున్నామనగా అసలు పౌరులెవరికీ ఆ విషయం తెలీదు.

చెబుతున్నదేంటి..?

ఎవరు ఏ పాత్ర పోషించాలో విధాన ప్రతిపాదనలలో వివరించారు. ప్రజలు తమ భూములను ప్రాజెక్టుకు సమర్పించాలి. ఆ విధంగా అగ్రిమెంట్ రాసివ్వాలి. ప్రభుత్వం మార్గదర్శకాలను, రూల్స్‌ను, నియంత్రణలను ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వానిది మధ్యవర్తి, సమన్వయకర్త పాత్ర. ప్రైవేటు సంస్థలు అవసరమైన పెట్టుబడులను, టెక్నాలజీని సమకూరుస్తాయి. భూములిచ్చిన రైతులు ప్రాజెక్టు పెట్టే డెవలపర్‌కు, ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదురుతుంది. దానిలో ప్రైవేటు, ప్రజల పాత్రలేమిటో నిర్ధారిస్తారు. భూములిచ్చిన రైతులకు ప్రాజెక్టు లాభాల్లో వాటాలు, డివిడెండ్లు, ఆ ప్రాంత యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల్లో శిక్షణల వంటివి ఉంటాయని పేర్కొన్నప్పటికీ అంతిమంగా భూములను రైతుల ఇష్ట ప్రకారం ప్రాజెక్టుకు ఇచ్చేలా అంగీకరింపజేసే అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకు ప్రభుత్వ శాఖలు పని చేస్తాయి. ప్రాజెక్టు నిర్వహణపై మార్గదర్శకాలిస్తాయి. ప్రభుత్వంలో పర్యవేక్షణకు వివిధ మిగతా 7లో

సిక్కోలు ఉద్యమానికి తీరని లోటు

- విజికె మూర్తి సంతాప సభలో వక్తలు
- రిమ్స్‌కు భౌతికకాయం

3




చిత్తూరు సమీపాన జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

చిత్తూరు, కర్నూలుల్లో విషాదం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

2



ఇక ప్రైవేటీకరణ సమస్య రాదు

- ఉద్యమాలు జయప్రదం • ప్యాకేజికి సమిష్టి కృషే కారణం • సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజితో ఇక ప్రైవేటీకరణ సమస్య రాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం కేంద్రప్రభుత్వం ప్రకటించిన రూ.11,404 కోట్ల ప్యాకేజిపై ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమాలు జయప్రదమయ్యాయని అన్నారు. సమిష్టికృషితోనే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజి ప్రకటించిందని చెప్పారు. 'ఇప్పుడు ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలి' అని అన్నారు. ఇప్పటి వరకు 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో ఉద్యమించామని, ఇప్పుడు 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల సెంటిమెంట్' అనే నినాదంతో పనిచేయాలని చెప్పారు.యాజమాన్యం సరిగా లేకుండా కార్మికులు, ఉద్యోగులు మాత్రమే పనిచేసినా ఫలితం ఉండదని, అందువల్ల .సమర్ధవంతమైన యాజమాన్యాన్ని నియమించి, సక్రమ నిర్వహణ చేయాల్సిఉందని చెప్పారు.. బలహీనపడుతున్న ప్లాంట్‌కు కేంద్రం సహాయం చేసిందని, దీనిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, ఉద్యోగులు బాధ్యతతో ప్రవర్తించాలని చెప్పారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకు ఎవరికీ హక్కు లేదన్నారు. ప్లాంట్ బలహీనపడుతుందనే కారణంతో తాము ఇలానే నిర్వహణ చేస్తామంటే కుదరదన్నారు. ప్యాకేజ్ ఇచ్చారనే ధీమాతో ఇష్టం ప్రకారం చేస్తామన్నా కుదరదన్నారు. ఇది ట్యాక్స్ పేయర్స్ మనీ అని,దీనిని సమర్ధవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు.

ప్లాంట్‌కు సరైన సిఇఓను నియమించి సమర్ధవంతంగా పనిచేయించాలని అన్నారు. స్టీల్‌ప్లాంట్ దెబ్బతిన్నట్లయితే చాలా సమస్యలు వస్తాయని, దీనిని కాపాడుకుంటూనే మరో పక్క 20లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్లాంట్ ఇబ్బందుల్లో ఉందనే కారణంతో నెలకయ్యే రూ.80కోట్ల విద్యుత్ బిల్లు, నీటి బిల్లులను కూడా రాష్ట్రప్రభుత్వం నాలుగు నెలల నుంచి వసూలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో విశాఖపట్నం, విజయనగరం పార్లమెంట్ సభ్యులు ఎం భరత్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్యాకేజీతో స్టీల్ సమస్య పరిష్కారమైనట్టు కాదు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్/ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంతోనే స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారమైనట్టు కాదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ విడుదల చేసినట్లు ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. దీంతోనే స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కారమైపోతుందని ప్రకటన చేయడం బూటకమని తెలిపారు. ఒక సంవత్సరం ముడి ఖనిజం కొనడానికి రూ.18 వేల కోట్లు ఖర్చవుతుందని, ఇప్పటికే ఉన్న రూ.12 వేల కోట్లు నష్టంగానీ, అప్పులుగానీ చూస్తే వచ్చిన ప్యాకేజీ ఏ మూలకూ సరిపోదన్నారు. దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు ఇచ్చి, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడవాలంటే సొంత ఇనుప గనులు ఇవ్వాలని, ప్రయివేటీకరణ చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

పోరాట విజయం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



స్టీల్‌ప్లాంట్ కోసం కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ కార్మిక పోరాట విజయమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన నాలుగు సంవత్సరాలుగా కార్మికులు అలుపెరగని పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

ప్యాకేజీ ఇవ్వడంతోపాటు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం ఇకపై ముందుకు రాదంటూ ఇచ్చిన ప్రకటనకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పుడు ఇచ్చిన ప్యాకేజీ సద్వినియోగం కావాలంటే స్టీల్‌ప్లాంట్‌ను సామర్థ్యానికి తగ్గ ఉత్పత్తితో నడిపించాలన్నారు. ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకుంటున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని, సొంత గనులు కేటాయించాలని కోరారు. ఇటీవల విడుదల చేసిన విఆర్ఎస్ ప్రకటనను పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 60 రోజులకు సరిపడా కోకింగ్ కోల్ నిల్వ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. నాలుగేళ్లపాటు ట్యాక్స్ హాలీడే ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఎండిసితో స్టీల్‌ప్లాంట్‌ను అనుసంధానం చేసి, సామర్థ్యానికి తగ్గ ఉత్పత్తితో నడిపిస్తే ప్లాంట్ లాభాల బాట పడుతుందని తెలిపారు. అప్పుడే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ సద్వినియోగమవుతుందని పేర్కొన్నారు.

శాఖాపరమైన విచారణలు..ఇక వేగవంతం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులపై నమోదవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు ఇక నుంచి వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. విచారణలు, దర్యాప్తులు ఏళ్ల పాటు పెండింగ్‌లో ఉంటుండటంతో సిబ్బంది పనితీరుపై ప్రభావం చూపిస్తోందని ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యుఎస్, అటవీ, పర్యావరణ శాఖల్లో నమోదైన విజిలెన్స్, ఎసిబి శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి? అందుకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత ముఖ్య కార్యదర్శులను శుక్రవారం ఆదేశించారు. విజిలెన్స్ పెండింగ్ కేసులపై నివేదికను మూడు వారాల్లో ఇవ్వాలని ఆదేశించారు. విజిలెన్స్, నాన్ విజిలెన్స్ కేసులను సరైన రీతిలో విచారించి వేగంగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని శాఖాధిపతులకు ఆయన సూచించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

కార్పొరేట్ గవర్నెన్స్ వద్దు

- ప్రభుత్వమే పౌర సేవల బాధ్యత తీసుకోవాలి • సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



డేటా రక్షణ చట్టం లేకుండా 150 రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందించడం పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వాట్సాప్ ద్వారా ఈ గవర్నెన్స్ సేవలు అందించేందుకు కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు దాన్ని 18వ తేదీన ప్రారంభించబోతున్నట్లు సిఎం ప్రకటించారని విదితమేనని తెలిపారు. ఏదైనా ఒక సర్టిఫికెట్ కావాల్సి వస్తే దానికి అందుతాయో సంబంధించిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలని, వాట్సాప్‌లో అవి భద్రంగా ఉంటాయన్న గ్యారంటీ లేదని తెలిపారు. వాటిని దుర్వినియోగం చేయరన్న చట్టబద్ధ హామీ లేదని, 2018 నుండి డేటా ప్రైవసీ చట్టం పెండింగ్‌లోనే ఉందని, అది చట్టం కాకుండా ఇలాంటి ఒప్పందాలు పౌరుల వ్యక్తిగత భద్రతకు ముప్పని అన్నారు. గతంలో ఆధార్ సహా అనేక రకాల డాక్యుమెంట్లు దుర్వినియోగమైన విషయం పేర్కొన్నారు. పౌర సేవలు వేగంగా లేదో గ్యారంటీ లేదని, కానీ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలకు డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం పుష్కలంగా ఉందని తెలిపారు. ఇప్పటికే మీ సేవ, సచివాలయ వ్యవస్థలున్నాయని, వాట్సాప్‌తో ఒప్పందం చేసుకుని సచివాలయ సిబ్బందిని తగ్గించాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని, దీనివల్ల మీ సేవ సిబ్బంది నిరుద్యోగులవుతారని అన్నారు. గోప్యంగా ఉండాల్సిన పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని అంబానీ, మెటా (ఫేస్‌బుక్) వంటి కార్పొరేట్ కంపెనీలపరం చేయడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. డేటా ప్రైవసీ రక్షణ చట్టం వచ్చేంత వరకు ఈ ఒప్పందాన్ని అమలు చేయొద్దని, సచివాలయ సిబ్బందిని కుదించొద్దని, మీసేవా కేంద్రాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

టిటిడి ఏప్రిల్ కోటా టికెట్ల విడుదల తేదీలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల ఏప్రిల్ కోటాను ఈ నెల 18న ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం 18 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొంది. లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని తెలిపింది. కాగా, ఏప్రిల్ 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల ఆర్జిత సేవా టికెట్లను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవల స్లాట్లకు సంబంధించి 21న మధ్యాహ్నం 3 గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

3 కేటగిరీలుగా సచివాలయాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాలను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా వర్గీకరించింది. ఈ మేరకు సిఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో సచివాలయాలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 3,500 జనాభాకు పైగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలను ఎ కేటగిరి, 2,501 నుంచి 3,500 వరకు జనాభా ఉన్న సచివాలయాలను బి కేటగిరిగా, 2,500 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లోని సచివాలయాలను సి కేటగిరిగా వర్గీకరించారు. ఎ కేటగిరి సచివాలయంలో ఎనిమిది మంది, బి కేటగిరి సచివాలయంలో ఏడుగురు, సి కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు సిబ్బందిని కేటాయించేందుకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులనూ మూడు విభాగాలుగా విభజించారు. మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్, ఆస్పిరేషనల్ ఫంక్షనరీస్‌గా విభజించారు. డ్రోన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటి తదితర సాంకేతిక విధానాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా ఆస్పిరేషనల్ ఫంక్షనరీస్‌ను వినియోగించుకోవాలని నిర్ణయం తీసుకుంది. గ్రామ సచివాలయాల ఉద్యోగులకు పంచాయతీ సెక్రటరీ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ హెడ్‌గా ఉండనున్నారు. నూతన వర్గీకరణలో సుమారు 60 వేల మంది వరకు మిగిలిపోతున్న సిబ్బందిని వారి అర్హతకు తగ్గట్లుగా మరో శాఖలో సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

పున:సమీక్షించాలి..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన అనంతరమే ప్రభుత్వం హేతు బద్ధీకరణ చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అనూరాధ, ప్రధాన కార్యదర్శి ఎం గురుస్వామి శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. హేతుబద్ధీకరణ నిర్ణయాన్ని పున:సమీక్షించాలన్నారు.

ఆరోగ్య సహాయకుల తొలగింపు బాధాకరం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న వందలాది మంది ఆరోగ్య సహాయకులను తొలగించడం బాధాకరమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి ప్రసాద్ విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణరావును కలిసి తొలగింపునకు సంబంధించిన వివరాలను తెలిపారు. వైద్యారోగ్య శాఖలోని ఆరోగ్య సహాయకులను తొలగిస్తే వారిని మెరిట్ విధానంలో తిరిగి నియమించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని వివరించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోలేదని, దీంతో ఉద్యోగాలు కోల్పోవడంతో తీవ్ర ఆందోళనలు, ఒత్తిళ్లకు గురవుతున్నారని వెల్లడించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖకు వెన్నుముక లాంటి ఆరోగ్య సహాయకులను తొలగించడం బాధాకారమని చెప్పారు. తక్షణమే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునేలా ప్రభుత్వంతో, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో తాను స్వయంగా మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



బాపట్ల జిల్లా అధ్యక్షులు శ్రీనును స్టేషన్‌కు తీసుకువచ్చిన పోలీసులు

వలంటీర్ల 'చలో అసెంబ్లీ' సందర్భంగా పలువురు గృహ నిర్బంధం

- ఉద్యోగ భద్రత కల్పించాలి : యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమాయున్

ప్రజాశక్తి - యంత్రాంగం

బకాయి వేతనాలు చెల్లించాలని, తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమంపై పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. పలువురు నాయకులను గృహ నిర్బంధం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు శుక్రవారం విజయవాడకు వస్తున్న పలువురు వలంటీర్లను ఎక్కడికక్కడే అడ్డుకొని అరెస్టు చేశారు. రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ హుమాయున్ బాషాను గురువారం రాత్రి పది గంటల నుంచి గృహ నిర్బంధంలో ఉంచారు. శుక్రవారం ఉదయం ఆయనను వేటపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై వదిలేశారు. విజయవాడకు వస్తున్న వలంటీర్ల బాపట్ల జిల్లా అధ్యక్షులు శ్రీనును చీరాల రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేసి.. వేటపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో షేక్ హుమాయున్ బాషా ఫోన్‌లో మాట్లాడారు. వలంటీర్లపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని విమర్శించారు. పోలీసులతో పోరాటాలను ఆపాలని చూడటం అవివేక చర్య అని అన్నారు. గురువారం రాత్రి పది గంటల నుంచి ఇల్లు కదలకుండా, కనీస అవసరాలు కూడా తీర్చుకోకుండా నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, రాజీనామాలు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, రూ.పది వేలు వేతన హామీ నెరవేర్చాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చిత్తూరు, కర్నూల్లో విషాదం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో విషాద ఘటనలు చోటు చేసుకున్నాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. 22 మందికి గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం... తిరుపతి నుండి తమిళనాడు రాష్ట్రం మధురైకు వెళ్తున్న వోల్వా ఎసి బస్సు, దీనికి ఎదురుగా వస్తున్న టిప్పర్ చిత్తూరుకు అతి సమీపంలోని గంగాసాగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఢీకొన్నాయి. దీంతో, బస్సులోని తిరుపతికి చెందిన శ్రీధర్, పున్ చంద్ర, తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారికి చెందిన జీవ, తంజావూరు ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన 22 మందిలో కొందరిని వేలూరులోని సిఎంసి ఆస్పత్రికి, మరికొందరిని చిత్తూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు



శ్రీధర్



తంజావూరు ప్రశాంత్

ప్రమాదంలో కోడుమూరుకు చెందిన 18వ వార్డ్ మెంబర్ సోమశేఖరు (45) బండ శ్రీనివాసులు (45) రాజోలి శ్రీనివాసులు (42) మృతి చెందారు. వీరు ముగ్గురూ వస్త్ర వ్యాపారులు. కర్నూలులో వ్యాపారం ముగించుకుని కారులో కోడుమూరుకు వస్తున్నారు.

వీరికి ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం టైర్ పేలడంతో అది అదుపు తప్పి కారు పైకి దూసుకెళ్లింది. దీంతో, కారు నుజ్జునుజ్జు అయింది. కారులోని ముగ్గురూ మృతి చెందారు.

సవరణ పిటిషన్ వేయండి

- తిరుపతి తొక్కిసలాట ఘటన పిల్‌పై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల జారీ సమయంలో తిరుపతిలో తొక్కిసలాట జరగడంపై న్యాయ విచారణకు ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌లో గవర్నర్ కార్యదర్శి, సిఎంను ప్రతివాదులుగా ఎలా చేస్తారని పిటిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను సమర్థించింది. వారిద్దరినీ ప్రతివాదుల జాబితా నుంచి తొలగించి సవరణ పిటిషన్‌ను దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కంచిరెడ్డి సురేష్ రెడ్డి, జస్టిస్ కె మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనతో గవర్నర్ కార్యదర్శి, ముఖ్యమంత్రికి ఏం సంబంధమని ప్రశ్నించింది. వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల జారీ సందర్భంగా ఈ నెల 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించారు. సుమారు 40 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై సిట్టింగ్ లేదా హైకోర్టు రిటైర్డు జడ్జితో విచారణకు ఆదేశాలు ఇవ్వాలంటూ కర్నూలు జిల్లా, పాండురంగాపురం రైతు గుడిబండ ప్రభాకర్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. న్యాయ విచారణ జరిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడంతో పాటు, 30 రోజుల్లో విచారణ నివేదికను గవర్నర్‌కు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిల్‌లో హైకోర్టును కోరారు.

జగన్ పిటిషన్‌పై కౌంటర్ వేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తన సెక్యూరిటీ టీమ్‌లో గతంలో ఉన్న డిఎస్‌పి ఎస్ మహబూబ్ బాషాను కొనసాగించేలా రాష్ట్రానికి ఆదేశాలివ్వాలంటూ మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ వేస్తామని కూడా రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. దీంతో విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కె మహేశ్వరరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఇ - గవర్నెన్స్‌కు ఎన్ఐఎస్‌జి సాంకేతిక సహకారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల ఇ-గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ సేవలకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ (ఎన్ఐఎస్‌జి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రాజీవ్ బన్సాల్ పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)లో ఎన్ఐఎస్‌జి ప్రతినిధుల బృందం.. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాజీవ్ బన్సాల్ మాట్లాడుతూ.. ఇ-గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ సురేష్ కుమార్, ఐటి కార్యదర్శి యువరాజ్, ఆర్‌టిజిఎస్ సిఇఒ కె దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

భూ అక్రమాలపై కఠిన చర్యలకు మంత్రుల విముఖత

కేబినెట్‌లో విస్తృతచర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత ప్రభుత్వ హయంలో చోటుచేసుకున్న భూ అక్రమాలపై శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కొందరు మంత్రులు విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిషేధిత భూముల జాబితాపై చర్చ జరిగిన సందర్భంలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఎక్కువ మంది మంత్రులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా, కొందరు మాత్రం ఆ తరహా చర్యలకు అయిష్టతను వ్యక్తం చేసినట్లు తెలిసింది. చర్యలు తీసుకోవచ్చుగాని, కఠిన చర్యలు అవసరం లేదని వీరు చెప్పినట్లు తెలిసింది. దీంతో ఈ విషయాన్ని మంత్రివర్గ ఉపసంఘానికి వదిలిపెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు చుక్కల భూములు, ఇతర నిషేధిత భూములను అనేక మందికి, సంస్థలకు కట్టబెట్టారని, అనేక చోట్ల రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయన్నదానిపై మంత్రివర్గ భేటీలో చర్చ జరిగింది. ఇటువంటి వాటిపై ఏం చర్యలు తీసుకోవాలన్న దానిపై అర్ధగంటకు పైగా చర్చ జరిగినట్లు తెలిసింది.

శాఖలపై మరింత దృష్టి

మంత్రులంతా తమ శాఖలపై నిశితంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు తెలిసింది. కొంతమంది పనితీరుపైనా చర్చ జరిగినట్లు సమాచారం. ఇకపై అంతా మరింత శ్రద్ధగా పనిచేయాలని నిర్దేశించారు. అలాగే కేంద్రంతో అనుసంధానం కలిగి రాష్ట్రానికి నిధులు వచ్చేలా చూడాలని కూడా మంత్రులకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. త్వరలోనే కేంద్ర బడ్జెట్ రానున్న నేపథ్యంలో పార్లమెంట్ సభ్యులతో సమన్వయం చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి కీలక పథకాలను వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించే అంశంపైనా చర్చ జరిగింది.

కోడి పందేల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులపై చర్యలు

డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కోడి పందేల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకోవాల్సిన రైతుల పండగను కలుషితం చేసి కోడి పందేలను, క్యాసినో వంటి విష సంస్కృతిని ప్రోత్సహించారని తెలిపారు. ఐక్యత కోసం ఆటలు.. యువజన మైత్రికి బాటలు వంటి పేర్లతో ప్రజా సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజల ఐక్యతను డివైఎఫ్ఐ వంటి ప్రజా సంఘాలు కాపాడుతున్నాయని తెలిపారు. మరోవైపు ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, కేంద్ర మంత్రులే దగ్గరుండి అన్ని ఏర్పాట్లతో కోడి పందేలు, క్యాసినోలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. సినిమా సెట్టింగ్ తలపించే విధంగా క్యారవాన్లు, డ్యాన్స్‌లు, మినీబార్‌లు వంటివి నిర్వహిస్తుంటే ఉన్నతాధికారులు, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రజాసంఘాలు నిర్వహించే చిన్న కార్యక్రమాలకు ఆగమేఘాలపై వచ్చి అరెస్టులు చేసే పోలీసులు వేలకోట్లతో జూదం ఆడుతున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వమే కోడి పందేలను ప్రోత్సహించడం సిగ్గుచేటని అన్నారు. దేశభక్తి పాఠాలు, సంస్కృతి గురించి నీతులు చెబుతున్న బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలే కోడి పందేలు, పేకాట క్లబ్‌లలో పాల్గొని సభ్య సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.

కోడి పందేలను అడ్డుకోవడానికి వెళ్లిన పోలీసులపై కొన్ని జిల్లాల్లో అధికార పార్టీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడ్డారని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి, కోర్టు ఆదేశాలను భేఖాతరు చేసిన ప్రజా ప్రతినిధులపై ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే యువతను కదిలించి తాము ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సమగ్రంగా రీ సర్వే

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ ఇన్ షెడ్యూల్ క్యాస్ట్ గడువును పెంచి, సమగ్రంగా రీ సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, సహాయ కార్యదర్శి జి నటరాజ్, జి క్రాంతికుమార్ శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ కమిషనరుకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌సి వర్గీకరణలో భాగంగా పరిశీలన కోసం నియమించిన ఏకసభ్య కమిషన్‌కు రిపోర్టు ఇవ్వడం కోసం ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారుల జాబితా ఆధారంగా నివేదిక తయారుచేశారని తెలిపారు. లిస్టుల్లో అనేక తప్పులు దొర్లాయన్నారు. వలంటీర్ల ద్వారా గ్రామ విఆర్‌ఒలు సర్వే చేయకుండా, వ్యక్తులను అడగకుండా పేరును బట్టి కులం, మతం డిసైడ్ చేసి నివేదికలు తయారు చేశారని వారు విమర్శించారు. నివేదికంతా తప్పుల తడకగా ఉందని, హిందువులను క్రిస్టియన్ బిసిలుగా చూపారని, ఫలితంగా ఎస్‌సి రిజర్వేషన్లు కోల్పోతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయం నుంచి వార్డు సభ్యులకు ఫోన్ చేయడం లేదా చాటింపు లేదా మైక్ ద్వారా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు మైదుకూరులో ముఖ్యమంత్రి పర్యటన

ప్రజాశక్తి - చాపాడు

స్వచ్ఛాంధ్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం కడప జిల్లా మైదుకూరు పర్యటనకు రానున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు సిఎం తన ఇంటి నుంచి బయలుదేరి 11 గంటలకు విజయవాడ ఎయిర్ పోర్ట్‌కు వస్తారు. 12 గంటలకు కడప ఎయిర్‌పోర్ట్‌కు, అక్కడ నుండి హెలికాప్టర్ ద్వారా 12.10 గంటలకు మైదుకూరు కోర్టు సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12.20 గంటలకు స్థానిక కెఎసి కల్యాణమండ పంలో ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని అక్కడే విలేకరుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఒంటి గంట నుంచి 1.45 గంటల వరకు విశ్రాంతి తీసుకుని, 1.55 గంటలకు ప్రొద్దుటూరు రోడ్డులోని వినాయకనగర్ కాలనీ ప్రజలతో మాట్లాడుతారు. 2.15 గంటల నుంచి స్వేచ్ఛాంధ్ర వాక్ నిర్వహించనున్నారు. 2.45 గంటలకు పారిశుధ్య వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తారు. మూడు గంటలకు హైస్కూల్‌లోని స్టాల్స్ సందర్శన, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఏర్పాటు చేయనున్న వివిధ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. 4.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

సిఆర్‌డిఎ పనుల పర్యవేక్షణ ఏజెన్సీగా అస్కి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపడుతున్న పనుల ఇండిపెండెంట్ వెరిఫికేషన్ ఏజెన్సీ (ఐవిఎ)గా హైదరాబాద్‌కు చెందిన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కి)ని నియమించారు. దీనిపై పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి కె కన్నబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రపంచ బ్యాంకు ఇస్తున్న నిధులకు సంబంధించి డిస్బర్సమెంట్ లింక్‌డ్ ఇండికేటర్స్ (డిఎల్ఐ) పర్యవేక్షణ అస్కి చేయనుంది.

రూ.2,723 కోట్ల పనులకు అనుమతి

అమరావతిలో రూ.2,723 కోట్లతో చేపట్టనున్న ఇంజినీరింగ్ పనులకు అనుమతి లభించింది. రోడ్లు, సదుపాయాలు, జోన్-7, 10 పరిధిలో మంచినీటి పైపులైన్లు, ఎస్‌టిపి వంటి పనులు చేపట్టనున్నారు. ఈ పనులను ఎల్‌అండ్‌టి సంస్థకు ఏడు సంవత్సరాల కాలపరిమితితో అప్పగించారు. గతంలో కేటాయించిన పనులకు సంబంధించి స్వల్ప సవరణలూ చేశారు. దీనిపైనా పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి కన్నబాబు జిఓ విడుదల చేశారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించకుంటే

ఉద్యమం మరింత ఉధృతం

- ధర్నాలో మాజీ ఎంపి పి మధు హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు హామీ ఇచ్చారని, ఇంతవరకు అమలు చేయలేదని, ఖరీఫ్ ముగిసి, రబీ సగం కాలం గడిచినా రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇదే పద్ధతి కొనసాగితే టిడిపి కూటమి ప్రభుత్వానికి జనం సున్నం రాస్తారని మాజీ ఎంపి పి మధు హెచ్చరించారు. రైతులను మోసం చేయాలని చూస్తే ఉద్యమం తీవ్రం చేస్తామని ప్రకటించారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి పి మధు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన పెట్టుబడి సాయం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఊసే లేకుండా పోయిందని అన్నారు. 2047 నాటికి ఏమి చేస్తామనే అంశంపై ఊదరగొడుతున్నారని, కానీ రూ.100 కోట్లు, రూ.150 కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రస్తావన చేయడం లేదని విమర్శించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని, అమరావతి, పోలవరం పేరుచెప్పి కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తామని చెప్పారని, ఆచరణలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. రైతుల ఆత్మహత్యలను నివారిస్తామని ప్రకటించారని, ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గానీ, ప్రస్తుతం సిఎం చంద్రబాబు నాయుడు గానీ రైతులకు చేసిందేమీ లేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం సాధన కోసం ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలో కరువు మండలాలు ప్రకటించినా ఇప్పటికీ అక్కడి రైతులకు న్యాయం చేయలేదని, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వడం లేదని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి రైతులకు తీవ్ర నష్టదాయకమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. కేంద్రం.. రైతుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేసేందుకు పూనుకుంటోందని తెలిపారు. ఇప్పటికే రైతు నేత దల్లేవాల్ 52 రోజులుగా ఆందోళన చేస్తున్నారని, సమస్యలపై చర్చించి రైతులకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా కేంద్రం పట్టించుకోవడం లేదని అన్నారు. దల్లేవాల్‌కు ఏమైనా జరిగితే దానికి కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. కౌలురైతులకు నష్టం కలిగించే చట్టాన్ని మార్చాలని ఎన్నిసార్లు కోరినా మార్చడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కౌలు రైతులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పాల రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుంచుమాటి అజయ్ మాట్లాడుతూ.. పాడి, వ్యవసాయం రెండూ రైతులను ఆదుకునేవని, ప్రభుత్వాలు మాత్రం వాటిని ఆదుకోవడం లేదని అన్నారు. పసుపు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్నా శివశంకర్ మాట్లాడుతూ.. పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడుతూ.. రైతులకు దిగుబడిని పెంచే చెరకు వంగడాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. మామిడి రైతుల సంఘం రాష్ట్ర నాయకులు పివి ఆంజనేయులు మాట్లాడుతూ.. మామిడి ఎగుమతుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం న్యాయసమ్మతంగా లేదని, రైతులకు నష్టం కలిగించేలా ఉందని తెలిపారు. చేపల రైతుల సంఘం నాయకులు బలరామ్, కొబ్బరి రైతుల సంఘం నాయకులు శ్రీనివాస్, పండ్ల తోటల రైతుల సంఘం నాయకులు శివారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమలత, రాష్ట్ర కమిటీ సభ్యులు భారతి తదితరులు ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన వి కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో లిఫ్టు ఇరిగేషన్ల కింద సాగు పెద్దయెత్తున ఉన్నా.. వాటిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, దెబ్బతిని పోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి నీటిని ఎత్తిపోసే లిఫ్టులను బాగు చేయించాలని కోరారు.


విజయవాడలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న పి మధు

బెల్టు షాపులు తొలగించాలని మహిళల ధర్నా

ప్రజాశక్తి-కురిచేడు (ప్రకాశం జిల్లా)

మద్యం బెల్టు షాపులను తొలగించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ఆవులమంద గ్రామ మహిళలు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ తమ పంచాయతీలో మొత్తం ఏడు గ్రామాలు ఉండగా తమ ఒక్క గ్రామంలోనే ఎనిమిది బెల్టు షాపులు ఏర్పాటు చేశారని తెలిపారు. మందుబాబులు తెల్లవారుజాము నుంచే బెల్ట్ షాపుల్లో లభించే మద్యం తాగి గొడవలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామంలో విచ్చలవిడిగా ఉన్న బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ బి.రజనీకుమారికు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.


తహశీల్దార్ బి.రజనీకుమారికు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు


దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ప్రకాశ్, పక్కన ఉమాదేవి

డీలర్ పరీక్ష రాసేందుకు వచ్చిన వ్యక్తి కిడ్నాప్

- నిరసనగా ఎమ్మెల్సీ భార్య ధర్నా

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

కడప జిల్లా పులివెందులలో టిడిపి నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుచరుడు, వేంపల్లెకు చెందిన ప్రకాశ్... రేషన్ దుకాణం కోసం పులివెందులలోని ఓ పాఠశాలలో పరీక్ష రాయడానికి వస్తుండగా కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి భార్య ఉమాదేవి రాతపరీక్ష కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. రాంగోపాల్‌రెడ్డి అనుచరులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పరీక్ష కేంద్రంలోకి ఎవ్వరూ వెళ్లకుండా గేటుకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. తమ అనుచరుడైన ప్రకాశ్‌ను పరీక్షకు వెళ్లనివ్వకుండా కొందరు కిడ్నాప్ చేశారని, ఆయన పరీక్ష కేంద్రం వద్దకు వచ్చే వరకూ ధర్నాను విరమించేది లేదన్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ప్రకాశ్‌ను పరీక్ష కేంద్రం వద్దకు తీసుకువచ్చారు. దీంతో ఉమాదేవి ధర్నా విరమించారు. తనను కిడ్నాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పులివెందుల పోలీసుస్టేషన్‌లో ప్రకాశ్ ఫిర్యాదు చేశారు.

ఆక్వా వ్యాపారి కిడ్నాప్

ప్రజాశక్తి - భీమవరం టౌన్ (పశ్చిమగోదావరి జిల్లా)


వెంకట సత్యనారాయణ (ఫైల్)

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం ఆక్వా వ్యాపారిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. దీంతో జిల్లా కేంద్రమైన భీమవరంలో తీవ్ర కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన ఆక్వా వ్యాపారి విశ్వనాథుని వెంకట సత్యనారాయణ (నాని) ఈ నెల 16న సాయంత్రం తన తల్లిదండ్రులను హైదరాబాద్ పంపించేందుకు కుమారుడు సాయినాథ్‌తో కలిసి కారులో భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. రైలు ఎక్కించేందుకు సాయినాథ్ స్టేషన్‌లోకి వెళ్లగా సత్యనారాయణ మాత్రం స్టేషన్ బయట కారులోనే ఉన్నారు. కొద్దిసేపటికి స్టేషన్ బయటకు వచ్చిన సాయినాథ్‌కు తన తండ్రి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు సత్యనారాయణను బలవంతంగా వారి కారులో తీసుకెళ్లినట్లు స్థానికుల ద్వారా పోలీసులకు తెలిసింది. దీంతో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అనంతపురంలో కిడ్నాపర్లను పట్టుకున్నట్లు సమాచారం. గతంలో ఆక్వా ఎక్స్‌పోర్ట్, రొయ్యల ప్రొసెసింగ్ యూనిట్లు నిర్వహించిన సత్యనారాయణ పలువురికి పెద్ద మొత్తంలో బాకీ ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఈ కిడ్నాప్ జరిగినట్లు సమాచారం.

రేషన్ బియ్యం కేసు నిందితులకు బెయిల్

ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) భార్య జయసుధకు సంబంధించిన పౌరసరఫరాల శాఖ గొడౌన్‌లో రేషన్ బియ్యం మాయం కేసుకు సంబంధించి రిమాండ్లో ఉన్న ముగ్గురు నిందితులకు బెయిల్ మంజూరైంది. మానసతేజ, బొర్రా ఆంజనేయులు, బోట్ల మంగారావులకు మచిలీపట్నం స్పెషల్ మొబైల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో కోటిరెడ్డికి గతంలోనే బెయిల్ వచ్చింది. ప్రధాన నిందితురాలు పేర్ని జయసుధ ఇప్పటికే ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. పేర్ని నాని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై 20న హైకోర్టులో వాదనలు జరగనున్నాయి.

సిక్కోలు ఉద్యమానికి తీరని లోటు

- విజికె మూర్తి సంతాప సభలో వక్తలు
- రిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సిపిఎం సీనియర్ నాయకులు విజికె మూర్తి మృతి సిక్కోలు ఉద్యమానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని కత్తెర వీధిలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన విజికె మూర్తి సంతాప సభలో వారు మాట్లాడారు. విజికె మూర్తి మృతి జిల్లా ఉద్యమంతోపాటు ప్రగతిశీల శక్తులకు తీరని లోటని అన్నారు. స్థానికంగా నిర్వహించిన ఉద్యమాలకు ఆయన చేదోడువాదోడుగా ఉండేవారని కొనియాడారు. విజికె మూర్తి వ్యక్తిత్వం ఉద్యమాల బలోపేతానికి దోహదపడిందన్నారు. మెరుగైన సమాజం కోసం పరితపించారని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ విజికె మూర్తి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి అని అన్నారు. శ్రీకాకుళంలోని ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులుగా ఆయన ఆ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పాఠశాలలోని తిలక్ హాలును పూర్తి చేయాలన్న విజికె మూర్తి ఆశయాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని, హాలుకు ఆయన పేరు పెడతామని హామీ ఇచ్చారు. అంతకుముందు విజికె మూర్తి భౌతికకాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



రిమ్స్‌కు విజికె మూర్తి భౌతికకాయం అంగీకార పత్రాలను అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

శ్రీకాకుళం నగరంలో అంతిమ యాత్ర

సంతాప సభ అనంతరం శ్రీకాకుళం నగరంలో విజికె మూర్తి అంతిమ యాత్ర సాగింది. భౌతికకాయం వెంట బైక్ ర్యాలీ నిర్వహించారు. కత్తెర వీధి నుంచి రిమ్స్ వైద్య కళాశాల వరకు అంతిమ యాత్ర సాగింది. విజికె మూర్తి కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు రిమ్స్ వైద్య కళాశాలకు అప్పగించారు. రిమ్స్ డైరెక్టర్ జి.వెంకటాచలం, శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ షకీల తదితరులు భౌతికకాయాన్ని కుటుంబసభ్యుల ఇష్టపూర్వకంగా అందిస్తున్నట్లు పత్రం తీసుకుని అనాటమీ విభాగానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, నాయకులు ఎం.కృష్ణమూర్తి, ఎస్.సుధాకర్, ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బిఎండబ్ల్యు నుంచి కొత్త ఇవి

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు కొత్తగా ఎస్‌యువిలో బిఎండబ్ల్యు ఎక్స్1 ఇవిని ఆవిష్కరించింది. దేశంలో తయారు చేసిన తమ తొలి విద్యుత్ వాహనమని బిఎండబ్ల్యు గ్రూప్ ఇండియా సిఇఒ విక్రమ్ పాహ్ తెలిపారు. దీని ప్రారంభ ధరను రూ.49,00,000 లక్షలుగా నిర్ణయించింది.



క్రెటా ఇవి విడుదల..

న్యూఢిల్లీ : హ్యుందాయ్ మోటార్ ఇండియా తన క్రెటా విద్యుత్ కారును విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరల శ్రేణి రూ.17.99-23.29 లక్షలుగా నిర్ణయించినట్లు హెచ్ఎంఐఎల్ ఎండి ఉన్సో కిమ్ తెలిపారు. హ్యుందాయ్ పాపులర్ కార్లలో క్రెటా ఒక్కటి. కొత్త కారు సింగిల్ ఛార్జ్‌తో 390 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.

డిస్కంల ఆదాయం, టారిఫ్ ప్రతిపాదనపై అభిప్రాయ సేకరణ

- విశాఖలో ఎపిఇఆర్‌సి 20వ స్టేట్ అడ్వైజరీ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)


సమావేశంలో పాల్గొన్న ఠాకూర్ రామసింగ్ తదితరులు

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఎపిఇఆర్‌సి) 20వ స్టేట్ అడ్వైజరీ కమిటీ సమావేశం విశాఖలోని ఎపిఇఆర్‌సి కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఇన్‌ఛార్జి చైర్మన్ ఠాకూర్ రామ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కంల మొత్తం ఆదాయ ఆవశ్యకత, టారిఫ్ ప్రతిపాదనలపై అభిప్రాయాలు సేకరించారు. లైసెన్స్‌దారులు అందించే నాణ్యత, వారిని కొనసాగింపునకు సంబంధించిన విషయాలపై చర్చించారు. లైసెన్స్‌దారుల సమస్యలు, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ, విద్యుత్ సరఫరా, యుటిలిటీల మొత్తం పనితీరు ప్రమాణాలపై సభ్యులు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సోలార్ గ్రూప్ టాప్, గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సిస్, డిమాండ్ సైట్ మేనేజ్‌మెంట్, తదితర నిబంధనలకు సంబంధించి గత ఏడాది కాలంలో కమిషన్ చేపట్టిన చర్యలను ఇన్‌ఛార్జ్ చైర్మన్ వివరించారు. డిస్కంలు స్మార్ట్ మీటర్లను ఎంపిక చేసిన వారికి సెక్యూరిటీ డిపాజిట్ రెగ్యులేషన్, సప్లయి కోడ్ రెగ్యులేషన్, విద్యుత్, జిటిసిఎస్ సరఫరా చేయాల్సిన లైసెరిజర్ డ్యూటీకి ఎపిఇఆర్‌సి ముసాయిదా సవరణలు జారీ చేసిందని, దీనికి ప్రజల నుంచి అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో ఎఆర్ఆర్ అండ్ టారిఫ్ ప్రతిపాదనలు, భద్రత, వినియోగదారుల సేవలను మెరుగుపరచడం వంటి ఇతర సమస్యలకు సంబంధించి ఎస్‌ఎసి సభ్యులు పలు సూచనలు చేశారు. డిస్కంల సిఎమ్‌డిలు వారికి సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో ఎపిఇఆర్‌సి సభ్యులు పివిఆర్.రెడ్డి, ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి కె.సంతోష్, ఎపి ట్రాన్స్‌కో డైరెక్టర్ ఎకెవి.భాస్కర్, ఎపిసిపిడిసిఎల్ అధికారి రాందాస్‌లతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా విద్యుత్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆందోళనలో మధ్య తరగతి

- వినిమయం పడిపోతోంది
- వృద్ధి మందగిస్తోంది
- ఆర్థిక వ్యవస్థపై రఘురాం రాజన్ విమర్శలు

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ మందగించడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. వినిమయ డిమాండ్‌లో పతనం చోటు చేసుకుంటుందన్నారు. బడ్జెట్ కు ముందు రాజన్ మధ్యతరగతి ప్రజల గురించి ఆందోళన వ్యక్తం చేయడం విశేషం. "దేశంలో డిమాండ్ వినియోగం బలంగా లేదు. మధ్యతరగతిలో ఎగువ శ్రేణి తప్పా.. ఉద్యోగాల కొరత కారణంగా దిగువ మధ్యతరగతి ప్రజలు బాధపడుతున్నారు. సమస్య ఇప్పటికీ అలాగే ఉంది." అని రాజన్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 2024-25లో భారత జిడిపి 6.4శాతానికి పరిమితమై.. నాలుగు నెలల కనిష్టానికి పడిపోనుందని ఇటీవల కేంద్ర గణంకాల శాఖ (ఎన్ఎస్ఒ) అంచనా వేసింది. గడిచిన జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రయివేటు వినిమయ డిమాండ్ 6 శాతం తగ్గిందని అంచనా. ఇంతక్రితం త్రైమాసికంలో 7.4 శాతంగా ఉంది.



'మనం ఒక విధమైన సర్దుబాట్లకు వచ్చాము స్థిరమైన వృద్ధి స్థాయి వైపు కదులుతున్నాము. ఇది 6 శాతం పరిధిలో ఉంది. ఇది కొత్త విషయం కానప్పటికీ ఆందోళన కలిగిస్తుంది. ఎందుకంటే 6 శాతం మనకు సరిపోదు. మనకు మరింత మెరుగైన వృద్ధి అవసరం. జనాభా డివిడెండ్‌కు అనుగుణంగా ఫలితాన్ని పొందాలి" అని రాజన్ పేర్కొన్నారు.

గడిచిన ఐదు త్రైమాసికాలుగా పట్టణ డిమాండ్ తగ్గుతోంది. మధ్యతరగతి, తక్కువ ఆదాయ కుటుంబాలు నిత్యావసరాలపై కూడా తక్కువ ఖర్చు చేస్తున్నాయి. అధిక ఆహార ద్రవ్యోల్బణం సబ్బులు, షాంపూల నుండి కార్లు, ద్విచక్ర వాహనాల వరకు, ముఖ్యంగా నగరాల్లో వస్తువుల డిమాండ్‌ను దెబ్బతీస్తోంది. రాబోయే బడ్జెట్‌లో పన్ను తగ్గింపు సామాన్యుల జేబుల్లో ఎక్కువ డబ్బును ఉంచుతుంది, ఇది ప్రపంచంలోని ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో వినిమయం పెంచడానికి దోహదం చేయనుంది.



ఆటోమొబైల్ రంగంలో విస్తృతావకాశాలు

- ఆటో ఎక్స్‌పోలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద వాహన ప్రదర్శన అయినా భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో రెండో ఎడిషన్ సంబరంగా ప్రారంభమైంది. న్యూఢిల్లీలోని భారత మండపం, ద్వారకలోని యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఢిల్లీ అండ్ ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్‌ల్లో సమాంతరంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. భారత మండపంలోని ఎక్స్‌పోను శనివారం కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హెచ్‌డి కుమారస్వామి, జితన్ రామ్ మంఝీ, మనోహర్ లాల్, పియూష్ గోయల్, హర్దీప్ సింగ్ పూరితో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ లాంచనంగా ప్రారంభించారు. జనవరి 22వ తేది వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో వివిధ కంపెనీలు దాదాపు 100 కొత్త కార్లను ఆవిష్కరించనున్నాయి. వాహన తయారీదారుల నుంచి ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, టైర్లు, ఇంధన స్టోరేజీ వ్యవస్థల తయారీదారులు, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, మెటీరియల్ రీసైక్లింగ్ చేసే సంస్థల వరకు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. ఇటీవల మరణించిన టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా, సుజుకి మోటార్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఒసము సుజుకి భారత ఆటోమొబైల్ రంగానికి విశేష సేవలను అందించారని ప్రధానీ గుర్తు చేసుకున్నారు. దేశంలో ఈ రంగం వృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలో పెరుగుతున్న మధ్యతరగతి, పట్టణీకరణ వేగవంతం, మౌలిక వసతుల అభివృద్ధి, మేక్ ఇన్ ఇండియా వాహనాలు ప్రధానంగా ఆటో రంగ వృద్ధికి మద్దతును ఇవ్వనున్నాయన్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, మౌలిక వసతుల కోసం రూ.11లక్షల కోట్ల వ్యయం చేసిందన్నారు. 5,100 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటాయని అంచనా. ఈ ప్రదర్శనను భారత్ సహా ప్రపంచ దేశాలకు చెందిన 5 లక్షల మంది సందర్శించే అవకాశం ఉంది. పరికరాల ప్రదర్శనలో 60 కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలు జరగనున్నాయి.

మారుతీ సుజుకీ నుంచి ఇ-విటారా




న్యూఢిల్లీ : మారుతీ సుజుకీ తన తొలి విద్యుత్ కారు ఇ-విటారాను ప్రదర్శించింది. ఈ కారును 100కు పైగా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకి వెల్లడించారు. అతిపెద్ద బ్యాటరీ వేరియంట్ 500 కిలోమీటర్లకు పైగా రేంజ్ ఇస్తుందని ఆ కంపెనీ తెలిపింది. మరికొన్ని నెలల్లోనే గుజరాత్ ప్లాంట్‌లో ఇ-విటారా ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు తొషిహిరో సుజుకీ వెల్లడించారు.

కొత్త ద్విచక్ర వాహనాలు..

న్యూఢిల్లీ : హోండా మోటార్‌సైకిల్ కంపెనీ గతేడాది ఆవిష్కరించిన కొత్త 'యాక్టివా ఇ' ధరలను తాజాగా ప్రకటించింది. రూ.1.17 లక్షల నుంచి రూ. 1.52 లక్షల మధ్య నిర్ణయించింది. ఇది ఒక సింగిల్ ఛార్జితో 102 కిమీ రేంజ్ అందిస్తుందని సమాచారం. మరో మోడల్ హోండా క్యూసి1ను కూడా ప్రదర్శించింది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ధర రూ.90,000గా ఉంది. టివిఎస్ అపాచీ ఆర్‌టిఎక్స్ 300ను విడుదల చేసింది. 299 సిసితో తెస్తోన్న ఇది ఆ బ్రాండ్ తొలి అడ్వెంచర్ బైక్. టివిఎస్ తన జూపిటర్ సిఎన్‌జిని ప్రదర్శించింది. దీని ధర రూ. 1 లక్ష నుంచి రూ. 1.10 లక్షల మధ్య ఉండొచ్చని అంచనా.

టాటా మోటార్స్ కొత్త మోడళ్ల ఆవిష్కరణ



న్యూఢిల్లీ : భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో టాటా మోటార్స్ పలు కొత్త మోడళ్లను ప్రదర్శించింది. వీటిలో హరియర్ ఇవి, అవిన్య ఎక్స్ కాన్సెప్ట్, న్యూ సియోర వాహనాలున్నాయి. కొత్త ఎస్‌యువి సియోరా ఐసిఇ కంబ్యూషన్ ఇంజిన్, ఎలక్ట్రిక్ వర్షన్‌లోనూ రానుందని ఆ కంపెనీ తెలిపింది. వీటి ఆవిష్కరణకు టాటా సన్స్ చంద్రశేఖరన్ హాజరయ్యారు. టాటా హరియర్ ఇవి తొలి మిడ్ సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యువి అని ఆ కంపెనీ తెలిపింది. అవిన్యా ఎక్స్ కాన్సెప్ట్ ప్రీమియం ఇవి మోడల్ అని తెలిపింది. ఇది 2026 నుంచి అందుబాటులోకి రానుందని ఆ కంపెనీ తెలిపింది.

సంపాదకీయం


ఇదీ చరిత్ర!

ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి రాజకీయ అధికారం కోసం తరచుగా... ప్రచారం, తప్పుడు సమాచారం, వాస్తవాలను వ్యూహాత్మకంగా వక్రీకరించడం అన్న సూత్రాన్ని అమలుచేస్తుంటాయి. 'తగినంత పెద్ద అబద్ధం చెప్పండి. దానిని తరచుగా పునరావృతం చేయండి. అది నిజం అవుతుంది' అన్నది సత్యాన్ని అసత్యంగా మార్చే గోబెల్ మంత్రం. ప్రస్తుత గోబెల్స్ మనవళ్లయిన హిందుత్వ సిద్ధాంతకర్తలు అబద్ధపు వారసత్వాన్ని అదే పంథాలో ముందుకు తీసుకెళుతున్నారు. ఆ క్రమంలోనే సర్దార్ పటేల్‌ను, నేతాజీ వారసత్వాన్ని కాజేయాలనుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించిన జవహర్‌లాల్ నెహ్రూను చరిత్ర నుంచి చెరిపేసే ప్రయత్నం చేశారు. చివరకు మొత్తం భారతీయ చరిత్రనే తిరగరాసే ప్రయత్నమూ చేస్తున్నారు. ఇటీవల 'ది వైర్'లో ఆనంద్ తెల్తుంబ్డే రాసిన "గోబెల్స్ మనవళ్ల 99 అబద్ధాలు" అన్న వ్యాసం వీళ్లెంత అబద్ధాలకోరులో తేటతెల్లం చేస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇలాంటిదే మరో పచ్చి అబద్ధాన్ని అలవోకగా చెప్పేశారు. చరిత్రను వక్రీకరిస్తూ '1947, ఆగస్టు 15న భారత్‌కు స్వాతంత్ర్యం రాలేదు. గతేడాది రామమందిరం ప్రతిష్టాపన జరిగిన జనవరి 22నే అసలైన స్వాతంత్ర్యం వచ్చింది' అని నిస్సిగ్గుగా చెప్పుకున్నారు.

వాస్తవానికి 1947లో స్వాతంత్ర్యం రాలేదని ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు కొత్తగా చెబుతున్న మాట కాదు. 1950కి ముందే నూతన రాజ్యాంగం పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ... మనుస్మృతిని అనుసరించాలని చెప్పడం ద్వారా ఈ ప్రక్రియకు తెరతీసింది. 2014లో అధికారం చేపట్టిన నాటినుంచి బిజెపి, సంఘ్‌పరివార్‌లు రాజ్యాంగంపై చేస్తున్న బహుముఖ దాడులు ఈ పదేళ్లలో పెరిగాయే తప్ప తగ్గలేదు. ప్రధాని నరేంద్రమోడి గణతంత్ర దినోత్సవానికి పోటీగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలని సెలవిచ్చారు. సినీనటి కంగనా రనౌత్ బిజెపి అధికారంలోకి వచ్చిన 2014లోనే మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇటీవల రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్‌పై రాజ్యసభ సాక్షిగా అమిత్‌షా అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో తమకెలాంటి పాత్ర లేదన్న విషయాన్ని మరుగుపరచి, తమకు లేని స్థానాన్ని కట్టబెట్టుకునే ప్రయత్నం తీవ్రంగా చేస్తోంది. కానీ, ఒకసారి చరిత్రలోకి వెళితే... నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు ఈ రాజ్యాంగంపై సంతకం చేశారు. ఓటింగ్ అనంతరం ముసాయిదా ఆమోదించబడింది. ఈ ముసాయిదా 1950, జనవరి 26న రాజ్యాంగంగా మారుతుందని ఆమోదం తెలిపింది. ఆ మేరకు రాజ్యాంగ ముసాయిదా జనవరి 26న రాజ్యాంగంగా చట్ట రూపం దాల్చింది. ఇదీ..చరిత్ర. తెలిసే వక్రీకరణలకు పాల్పడుతున్నారా? దేశ చరిత్ర, స్వాతంత్ర్యం గురించి ఏ సంబంధంలేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వక్కాణింపులు ఎలాంటి నిర్ధారణ కాదనేది దేశ ప్రజలకు తెలుసు.

రామాయణం, మహాభారతం రాసిన వారు తాము చరిత్ర రాసినట్లు ఎప్పుడూ చెప్పుకోలేదు. ఇవి అపోహలు కాబట్టి. పురాణాన్ని చరిత్రగా భావించడం ప్రమాదకరం అని పలువురు చరిత్రకారులు చెబుతున్నారు. 'భారతదేశం, దేశ లౌకికవాదం...ఆర్‌ఎస్‌ఎస్ కంటే బలమైనది. మత విద్వేషాన్ని వ్యాపింపజేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను భారత్ ఎప్పటికీ అనుమతించదు' అని ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ అన్నారు. బిజెపి సాధనంగా ఆర్‌ఎస్‌ఎస్ ఈ ప్రమాదకర పనికి తెగబడుతోంది. ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాల్లో సవరణలు చేస్తూ...చరిత్రను చెరిపివేసే ప్రయత్నం చేస్తోంది. నిజానికి భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ గాని, దాని పూర్వరూపమైన హిందూ మహాసభ గానీ ఏనాడూ పాల్గొనలేదు సరికదా అవకాశం వచ్చిన ప్రతిసారీ బ్రిటిష్ వారికి సహకరించాయి. కనుకనే ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పడం ద్వారా... అదే నిజమని నమ్మించాలనే వ్యర్థ ప్రయత్నం ఆర్‌ఎస్‌ఎస్ చేస్తోంది. ప్రజలు తమను ఎన్నుకున్నది అభివృద్ధి కోసమే తప్ప మత ప్రచారం కోసం కాదన్నది 140 కోట్ల పైగా వున్న భారతీయుల మాట. బిజెపి కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష మద్దతుతో చరిత్ర మీద పెద్దఎత్తున సాగిస్తోన్న ఈ దాడిని ప్రతిఘటించడం ద్వారా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఎత్తుగడలను ఎదుర్కోవాలి. సంఘ్‌పరివార్ చేస్తున్న చరిత్ర వక్రీకరణలను ఎప్పటికప్పుడు ఎండగట్టడం లౌకిక, పురోగామి శక్తుల ముందున్న తక్షణ కర్తవ్యం.

మహనీయుల మాట



ఒక వ్యక్తి మరో వ్యక్తిని దోపిడీ చేయడం అన్నది ఏ మేరకు అంతమౌతుందో ఒక జాతి మరో జాతిని దోపిడీ చెయ్యడం కూడా అదే మేరకు అంతమవుతుంది. ఒక జాతిలో వర్గ శతృత్వం ఏ మేరకు మాయవమవుతుందో ఒక జాతికీ మరో జాతికీ మధ్య శతృత్వం కూడా ఆ మేరకు అంతమవుతుంది.

- కారల్ మార్క్స్, ఏంగెల్స్, కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక .

వ్యాఖ్య

అధ్వాన్న స్థాయికి ఆర్థిక మందగమనం


అధికారికంగా ప్రకటించే జిడిపి పెరుగుదల లెక్క అనుమానాస్పదంగా వుంటోంది. ఎందుకంటే వినియోగదారుల ధరల సూచి ఆధారంగా తీసే లెక్కలలో నాలుగో వంతు కూడా లేని అంతర్గత ద్రవ్యోల్బణ భావన ప్రాతిపదికగా అది రూపొందుతున్నది. ఈ విధంగా వండిన లెక్కలతో కూడినదే అయినా అది కూడా ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడిందనే వాస్తవం మాత్రం దాచలేనిదిగా తయారైంది. 2024-25కు సంబంధించి తాజాగా విడుదలైన జిడిపి అంచనాలు కూడా అదే చెబుతున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో ఇండియా జిడిపి పెరుగుదల 6.4 శాతం వుంటుందని ముందస్తు అంచనాలు పేర్కొంటున్నాయి. గత ఏడాది ఇది 8.2 శాతం పెరుగుదలతో దీన్ని పోల్చవలసి వుంటుంది. ఇంతకన్నా ముందు మూడవ త్రైమాసికంలో ఈ పెరుగుదల రేటు 5.4 శాతం వుండింది.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే దేశంగా ఇండియా ఆవిర్భవించిందనే మాటలు చాలా వినిపిస్తుంటాయి. 2027 నాటికి దేశం 5 లక్షల కోట్ల ఆలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందనీ చెబుతుంటారు. ఇవన్నీ ఏమైనా వాస్తవాలు మాత్రం పూర్తి భిన్నంగా వున్నాయి. నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, తక్కువ స్థాయి ప్రైవేటు పెట్టుబడులు, స్తంభించిపోయిన వినియోగదారీ వ్యయం, చిన్న చిల్లర రుణాల చెల్లింపులో వైఫల్యాల పెరుగుదల, ఉత్పత్తి రంగం పడిపోతుండడటం ఇవన్నీ కూడా ప్రభుత్వ ఆర్థిక విధానాల దివాళాకోరుతనానికే సంకేతాలుగా వున్నాయి.

మూల కారణమేంటి?

ఆర్థిక మందగమనం కొనసాగుతుండటానికి ప్రధాన కారణం వ్యవస్థలో గిరాకీ లేకపోవడమే. అల్పిష్టి ఆదాయాలుగల ప్రజలకు కొనుగోలు శక్తి లేకుండా పోయిన ఫలితమిది. 2023-24 సంవత్సరానికి గాను ఇటీవలే విడుదల చేసిన గృహాల వినియోగ వ్యయం వివరాలు చూస్తే నలుగురు సభ్యులున్న ఒక కుటుంబం నెలవారీ సగటు ఖర్చు పల్లెల్లోనైతే రూ.8,079, పట్టణాలలోనైతే రూ.14,528 మాత్రమేనని తేలింది. పెరిగిపోయే నిరుద్యోగం, ద్రవ్యోల్బణం దీన్ని మరింత జటిలంగా మారుస్తున్నాయి. వాటి వల్ల ఆదాయాలు హరించుకుపోతున్నాయి. గిరాకీ కొరవడిన పరిస్థితి ఉత్పత్తిని దెబ్బతీస్తుంది. కొత్తగా పెట్టుబడులు పెట్టి ఉత్పాదక సామర్థ్యాలు పెంచాలనే ఆసక్తి లేకుండా పోతుంది. మరోవైపున ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ అక్టోబర్ నెలల్లో దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్.డి.ఐలు) ప్రవాహాలు చూస్తే 12 ఏళ్ల కాలంలో ఎన్నడూ లేనంత దిగువకు పడిపోయాయి. ఇక బయిటకు తరలిపోయే వాటిని గనక చూస్తే విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు వాటిని దేశం నుంచి తీసుకుపోవడం పెరిగింది. భారతీయ కంపెనీలు విదేశాలలో పెట్టుబడులు పెట్టడం కూడా పెరగడం దీన్ని మరింత సంక్లిష్టం చేసింది. ఎన్ని గొప్పలు చెప్పినా భారతీయ కార్పొరేట్లకు స్వదేశం కన్నా విదేశాల్లో పెట్టుబడులు పెట్టడమే ఎక్కువ ఆకర్షణగా కనిపిస్తున్నది. విలువ కోల్పోతూ డాలర్‌కు 86కు చేరిన భారతీయ రూపాయి ఇప్పటికే వున్న సమస్యలను మరింత దుర్భరం చేయబోతున్నది. దాని వల్ల దిగుమతులు ఖరీదవడం, ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోయడం జరుగుతుంది.

ఆర్థిక మందగమనం కొనసాగుతుండటానికి ప్రధాన కారణం వ్యవస్థలో గిరాకీ లేకపోవడమే. అల్పిష్టి ఆదాయాలుగల ప్రజలకు కొనుగోలు శక్తి లేకుండా పోయిన ఫలితమిది. 2023-24 సంవత్సరానికి గాను ఇటీవలే విడుదల చేసిన గృహాల వినియోగ వ్యయం వివరాలు చూస్తే నలుగురు సభ్యులున్న ఒక కుటుంబం నెలవారీ సగటు ఖర్చు పల్లెల్లోనైతే రూ. 8,079, పట్టణాలలోనైతే రూ.14,528 మాత్రమేనని తేలింది. పెరిగిపోయే నిరుద్యోగం, ద్రవ్యోల్బణం దీన్ని మరింత జటిలంగా మారుస్తున్నాయి. వాటి వల్ల ఆదాయాలు హరించుకుపోతున్నాయి. గిరాకీ కొరవడిన పరిస్థితి ఉత్పత్తిని దెబ్బతీస్తుంది. కొత్తగా పెట్టుబడులు పెట్టి ఉత్పాదక సామర్థ్యాలు పెంచాలనే ఆసక్తి లేకుండా పోతుంది.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

బడా సంపన్నులకే సేవ

బడా వ్యాపార వ్యవస్థలకు అనుకూలమైన ప్రభుత్వ పాక్షిక విధానాలు అసమానతలను ఎగదోస్తున్నాయి. దానివల్ల ప్రైవేటు పెట్టుబడులు అభివృద్ధి దెబ్బ తింటున్నాయి. బిలియనీర్ ప్రమోటర్ల క్లబ్బులో గత ఏడాది చివరన 157 మంది వుంటే 2024లో ఆ సంఖ్య రికార్డు స్థాయిలో 201కి పెరిగింది. వారి మొత్తం సంపద కలిసి మొదటిసారిగా లక్ష కోట్ల డాలర్లు దాటింది.

ఆదాయాల తగ్గుదల, పెరిగిపోతున్న వ్యయాలు, హద్దూ ఆపూ లేని నిరుద్యోగంతో ప్రజలపై భారాలు పెంచుతూ అంతకంతకూ తీవ్రమవుతున్న సంక్షోభాన్ని ఎలా పరిష్కరించాలనే విషయమై ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో వుంది.

షరా మామూలే?

మోడీ ప్రభుత్వ తీరును గమనిస్తే వచ్చే 2025-26 బడ్జెట్ కూడా ఇప్పటి వరకూ అది ఏఏటికా ఏడాది కుమ్మరిస్తున్న తరహా విధానాలే మరింత పెంచే విధంగా ముగుస్తుంది. కార్పొరేట్ల మీద బడా సంపన్నుల మీద పన్నులు పెంచి మౌలిక సదుపాయాలు వ్యవసాయ రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచి, చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ఇప్పుడు జరగాల్సి వుంటుంది. ప్రస్తుతం జిడిపిలో 7 శాతం మాత్రమే వున్న సంక్షేమ రంగ వ్యయాన్ని పెంచడం అవసరం, ఈ చర్యలు తీసుకోకపోతే ఆర్థిక పునరుద్ధరణ గానీ, ప్రజలకు ఉపశమనం కలిగే అవకాశాలు శూన్యమే అవుతాయి.

(జనవరి 15 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సందర్భం

మద్రాస్ హైకోర్టు తీర్పు
హిందూత్వ మనువాదులకు చెంపపెట్టు!

సత్య

ఉన్నది ఉన్నట్లు చెప్పినా తమ మనోభావాలను దెబ్బ తీశారంటూ దెబ్బలాటలకు దిగుతున్న పరిస్థితి. తరతరాలుగా జరుగుతున్నదే. భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని నాటి క్రైస్తవ మతగ్రంథాలు, జ్యోతిష గ్రంథాలు చెప్పినది వాస్తవం కాదని సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్నదని నిరూపించిన ఖగోళ శాస్త్రజ్ఞుడు నికోలస్ కోపర్నికస్‌పై ఐదు వందల సంవత్సరాల క్రితమే నాటి క్రైస్తవ మతవాదులు దాడి చేశారు, మూర్ఖుడని నిందించారు. చరిత్రలో ఏ మతవాదీ నిజాన్ని అంగీకరించిన దాఖలా లేదు. మన దేశంలో హిందూత్వ, ఇస్లామిక్, క్రైస్తవ మతవాదులు దానికి అతీతులు కాదు. అలాంటి వారికి 2025 జనవరి మొదటి వారంలో మద్రాస్ హైకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చింది.

తమిళనాడులో విడుతలై చిరుతాయిగల్ కచ్చి (విసికె) అనే పార్టీ ఎంపీ తిరుమావళవన్. అతని మీద 2020లో ఒక ప్రైవేటు కేసు నమోదైంది. అదేమిటంటే పెరియార్ అనే యూట్యూబ్ ఛానల్‌లో ఫిర్యాదుదారు ఒక కార్యక్రమాన్ని చూశారు. తిరుమావళవన్ మరొక వ్యక్తితో కలసి హిందూ మహిళల గురించి బహిరంగంగా చెప్పిన మాటలు వారి స్థాయిని దిగజార్చేవిగా ఉన్నాయని, వారి గురించి ఒక తప్పుడు కథనాన్ని చెప్పారని, వాటిని విని ఒక హిందువుగా అవమానకరంగా భావించానని, తన మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నందున తగిన చర్యలు తీసుకొని శిక్షించాలన్నది కేసు సారం. ఆ కేసులో పసలేదని దాన్ని కొట్టివేయాలంటూ తిరుమావళవన్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దాని మీద విచారణ జరిపిన న్యాయమూర్తి పి.వేలుమురుగన్ కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. కరోనా సమయంలో 'పెరియార్-భారత రాజకీయాలు' అనే అంశంపై యూరోపియన్ పెరియార్ అంబేద్కర్ కామ్రేడ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో తిరుమావళవన్ ప్రసంగించారు. దానిలో మనుస్మృతిలో ఉన్న కొన్ని అంశాలను ప్రస్తావించారు. అవి తమ మనోభావాలను దెబ్బ తీశాయన్నది కేసు. అయితే తిరుమావళవన్ మనుస్మృతిలో ఉన్న అంశాలను ప్రస్తావించి వాటికి అర్థం చెప్పారు. తానుగా కొత్తగా చెప్పిందేమీ లేనందున ఎలాంటి చర్య తీసుకోనవసరం లేదంటూ న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. తిరోగామి భావజాలం గురించి గతంలోనే అనేక మంది చీల్చి చెండాడారు. వాటిని పునశ్చరణ చేయవచ్చు, మరింతగా వివరించవచ్చు. అంతే కాదు ఈ తీర్పుతో ఒకటి స్పష్టమైంది. ఎవరినీ కొట్టావద్దు తిట్టావద్దు, పురాతన సంస్కృత గ్రంథాల్లో ఉన్న వాటి అసలు అర్థాలను చెబుతూ వాటిని జనంలోకి మరింతగా తీసుకువెళితే చాలు. ముంజేతిని చూసుకొనేందుకు అద్దాలు అవసరం లేదు.

ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టులో దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని 2020 నవంబరులో జస్టిస్ ఎం సత్యనారాయణన్, జస్టిస్ ఆర్ హేమలత డివిజన్ బెంచి కొట్టివేసింది. ఎస్ కాశీరామలింగం దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో బిజెపి నేత, న్యాయవాది ఆర్‌సి పాల్ కనకరాజ్ వాదించారు. ఉనికిలో లేని మనుస్మృతిని నిషేధించాలని పార్లమెంటు సభ్యుడు కోరుతూ చేసిన ప్రసంగం అశాంతికి, వివిధ తరగతులను రెచ్చగొట్టటానికి దోహదం చేసినందున సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని కోర్టును కోరారు. ప్రసంగం చేయటమే గాక దాన్ని నిషేధించాలని కూడా డిమాండ్ చేశారన్నారు. మనుస్మృతి రాజ్యాంగ బద్ధమైనదేమీ కాదని, అందువలన దాన్ని ఫలాన విధంగానే చదవాలనే నిబంధనేమీ లేదని, రెండు వేల సంవత్సరాల నాటి గ్రంథానికి భాష్యాలు చెప్పవచ్చని అందువలన ఎంపీపై చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని కోర్టు తీర్పు చెప్పింది. దానిలో చెప్పిన నైతిక నియమావళి రాజ్యాంగబద్ధం కాదని, వాటిని అమలు జరపలేమని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వాద ప్రతివాదనల సందర్భంగా తమ పిటీషన్‌ను ఉపసంహరించుకొని రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అంశాలతో మరొక పిటీషన్ దాఖలు చేసేందుకు అనుమతించాలని న్యాయవాది పాల్ కనకరాజ్ కోర్టును కోరారు. చివరికి పిల్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ అంశం మీదే జిల్లా కోర్టులో ఒక ప్రైవేట్ కేసును దాఖలు చేశారు.దాన్ని ఈ నెలలో హైకోర్టు కొట్టివేసింది.

మద్రాస్ హైకోర్టు తీర్పు మరో ఉదంతాన్ని గుర్తుకు తెచ్చింది. కర్ణాటకలో మైసూరు విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్, ప్రముఖ రచయిత, హేతువాది కెఎస్. భగవాన్. రామాయణం ఉత్తరకాండలో ఉన్న వాటిని గురించి చెప్పినందుకు హిందూత్వవాదులు అంతుచూస్తామని బెదిరించారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయన ఈ అంశాలను చెబుతున్నారు. ఉత్తరకాండలో ఉన్నదాని ప్రకారం రాముడు పదకొండువేల సంవత్సరాలు పాలించలేదని, పదకొండు ఏళ్లు మాత్రమే రాజుగా ఉన్నట్లు, అడవుల్లో తాను మద్యం తాగుతూ సీతాదేవిని కూడా తాగమని కోరినట్లు, కొందరు రామరాజ్యం తెస్తామని చెబుతున్నారని, రాముడు ఆదర్శప్రాయుడేమీ కాదని భగవాన్ చెప్పిన అంశాలు తమ మనోభావాలను గాయపరచినట్లు కొందరు ప్రైవేటు కేసును దాఖలు చేశారు. సీతాదేవిని అడవుల పాల్జేసి పట్టించుకోని, శూద్రుడైన శంబుకుణ్ని వధించిన రాముడిని ఎలా సమర్థిస్తారని భగవాన్ ప్రశ్నించారు. "ప్రొఫెసర్ కల్బుర్గి, గోవింద్ పన్సారే, నరేంద్ర దభోల్కర్‌లను హత్య చేసినవారు ఇప్పుడు నన్ను కూడా చంపుతామని బెదిరిస్తున్నారు. వారికి నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. మీరు మా మీద దాడి చేయవచ్చు, ముక్కలుగా నరకవచ్చు కానీ మా రచనలు సజీవంగానే ఉంటాయి. వారు నన్ను చంపవచ్చు తప్ప. నా వైఖరిని మార్చలేరు" అని భగవాన్ స్పష్టం చేశారు. ఈ వివాదం తరువాత కొంత మంది అసలు ఉత్తరకాండను వాల్మీకి రాయలేదని, తరువాత కొందరు దాన్ని చేర్చారని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రామాయణాలు అనేకం ఉన్నాయి. దేన్ని సాధికారికంగా తీసుకోవాలో చెప్పినవారెవరూ లేదు. ఎవరికీ అలాంటి సాధికారత లేదు. ఎవరైనా పుచ్చుకుంటే దానితో అంగీకరించాలని కూడా లేదు.

కరోనా సమయంలో 'పెరియార్-భారత రాజకీయాలు' అనే అంశంపై యూరోపియన్ పెరియార్ అంబేద్కర్ కామ్రేడ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో తిరుమావళవన్ ప్రసంగించారు. దానిలో మనుస్మృతిలో ఉన్న కొన్ని అంశాలను ప్రస్తావించారు. అవి తమ మనోభావాలను దెబ్బతీశాయన్నది కేసు. అయితే తిరుమావళవన్ మనుస్మృతిలో ఉన్న అంశాలను ప్రస్తావించి వాటికి అర్థం చెప్పారు తానుగా కొత్తగా చెప్పిందేమీ లేనందున ఎలాంటి చర్య తీసుకోనవసరం లేదంటూ న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. తిరోగామి భావజాలం గురించి గతంలోనే అనేక మంది చీల్చి చెండాడారు. వాటిని పునశ్చరణ చేయవచ్చు, మరింతగా వివరించవచ్చు.



మనుస్మృతిలో రాసినవి, వాటి ఆచరణ చూసి తన మనోభావాలు తీవ్రంగా గాయపడిన కారణంగానే బాబాసాహెబ్ అంబేద్కర్ వంద సంవత్సరాల క్రితమే దాన్ని తగులబెట్టి నిరసన వెల్లడించారు. సదరు మనువాదాన్ని మరింతగా ముందుకు తీసుకుపోవాలని, అది లేకుండా రచించిన రాజ్యాంగాన్ని విమర్శిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక సంపాదకీయాలు రాసింది. రాజ్యాంగ నిర్మాతలు పక్కన పెట్టిన మనుస్మృతిని తమ న్యాయశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. కోర్టులలో అమలు చేసే శిక్షాస్మృతులను పాఠాలుగా చెప్పాలి, శిక్షణ ఇవ్వాలి తప్ప ఇలాంటి చర్యలతో అధికారికంగా మనువాదులను తయారు చేసే వ్యవహారం తప్ప మరొకటి కాదు. ఇలాంటి బలవంతాలు చేసే శక్తులు ఒక వైపు రెచ్చిపోతుంటే మరోవైపు దాన్ని వ్యతిరేకించేవారు కూడా ఎప్పటికప్పుడు తయారవుతారు. నూతన ఆర్థిక విధానాల పేరుతో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంస్కరణలు దేశంలో ఆర్థిక అసమానతలను మరింతగా పెంచి, కార్పొరేట్ జలగలకు జనాలను అప్పచెప్పాయి. వాటిని మరింత వేగంగా అమలు జరుపుతున్న బిజెపి నూతన విద్యావిధానం పేరుతో తన కాషాయ ఎజెండాను దేశం మీద రుద్దేందుకు పూనుకుంది. దానిలో భాగమే సిలబస్‌లో మనువాదాన్ని చేర్చటం. మరింతగా మనువాదులను న్యాయ వ్యవస్థలో చేర్చేందుకు వేసిన పథకమిది. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు విద్య, సమాన హక్కులు, సాధికారతను పూర్తిగా వ్యతిరేకించే తిరోగమన భావాలను బలవంతంగా అధ్యయనం చేయించేందుకు చూస్తున్నారు. అంతేకాదు, శూద్రులు, దళితులుగా ఉన్న 85 శాతం మంది గురించి కూడా దాన్నిండా వ్యతిరేకతలే, మొత్తంగా మన రాజ్యాంగానికి, దానికి స్ఫూర్తికి వ్యతిరేకమైనది.

ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భగత్ సింగ్ స్టూడెంట్స్ మోర్చా (బిఎస్ఎం)కు చెందిన వారు డిసెంబరు 25న మనుస్మృతి గ్రంథంపై ఒక చర్చ నిర్వహించారు. తరువాత తగుల బెట్టేందుకు నిర్ణయించారు. ఆ సందర్భంగా ముగ్గురు విద్యార్థినులతో సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేసి కేసు పెట్టారు. పదిహేడు రోజుల తరువాత వారు బెయిలు మీద జనవరి 11న విడుదలయ్యారు. ఈ విశ్వవిద్యాలయంలో మనుస్మృతిపై పరిశోధన చేసే వారికి ఫెలోషిప్ ఇస్తున్నారు. దాని గురించి చర్చించేవారిని తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మన నేతన్నలను దెబ్బతీసిన విదేశీ వస్త్రదహనం ఒక పోరాట రూపంగా ఉన్న సంగతి తెలిసిందే. అదే విధంగా దిష్టిబొమ్మల దహనం కూడా. సమాజంలో స్త్రీలు, మెజారిటీ కులాల వారిపట్ల వివక్ష, దురాచారాలను ప్రోత్సహించే మనుస్మృతికి వ్యతిరేకంగా ఒక నిరసన రూపంగా దాని దహనాన్ని అంబేద్కర్ ఎంచుకున్నారు. తొలిసారిగా 1927లో స్వయంగా ఆపని చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబరు 25ను మనుస్మృతి దహన దినంగా పాటిస్తున్నారు. ఎక్కడో అక్కడ అది కొనసాగుతూనే ఉంది. బెనారస్ విశ్వవిద్యాలయ విద్యార్థులు హింసాకాండకు, దాడులకు పాల్పడ్డారంటూ తప్పుడు కేసులు పెట్టారు. కస్టడీలో పోలీసులు వారిని కొట్టారు, దుస్తులు చించివేశారు, బెదిరించారు. పదేళ్ల వరకు శిక్షలు పడే సెక్షన్లతో నేరాలను మోపారు. ఉగ్రవాద వ్యతిరేక దళ పోలీసులు వారిని విచారించటాన్ని బట్టి ఎలాంటి నేరాలు మోపారో, ఉత్తర ప్రదేశ్‌లో ఎలాంటి రాజ్యం నడుస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ★

అభిప్రాయం



కాలం అనంతం భూమి విశాలం

ఆధునిక మానవుడు అవనీతలంపై అవతరించిన నాటి నుండి కాలానికి ఎదురీదాలని ఎన్నెన్ని సాహసాలు చేస్తూ వచ్చాడో చెప్పలేము. ఎక్కడో తూర్పు ఆఫ్రికా నుంచి తెరలు తెరలుగా, గుంపులు గుంపులుగా మహా నదీనదాలు, సాగరాలు దాటుకుంటూ భూమండలం అంతా విస్తరించిన అతని తెగువనూ, పట్టుదలనూ తలచుకుంటే మనల్ని సంభ్రమాశ్చర్యాలే కాదు, ఉత్తేజోద్వేగాలూ చుట్టుముడతాయి. ఆధునిక మానవుడి ఊహకైనా అందని విషయమిది. చాలామందికి ఒప్పుకో బుద్దెయ్యదు గానీ వాస్తవం వాస్తవమే! అక్షరాలా ఆఫ్రికా మనందరికీ పుట్టిల్లు!

మూడు లక్షల ఏళ్ల నుంచి మన హోమోసేపియన్ల ప్రయాణం ఇలా ఎక్కడి నుంచి ఎక్కడెక్కడికో కొనసాగుతూనే వుంది. ఇప్పటికీ ఒక్క మన దేశం నుంచే 1.40 కోట్ల మంది విదేశాల్లో పని చేస్తున్నారంటే ఈ ఒరవడి ఎంత తీవ్రమైందో, సహజమైందో చెప్పనక్కరలేదు. గత పదేళ్లలో పద్దెనిమిది లక్షల మంది దేశ పౌరసత్వం వదులు కొన్నారంటే లోకం ఎటువైపు పయనిస్తోందో తెలుస్తూనే వుంది. మధ్యలో ఎన్ని అవాంతరాలో, వాటి నుంచి ఎన్ని అనుభవాలో? ఎన్ని సాహసాలో, వాటి వెంట ఎన్ని విజయాలో, విలయాలో? ఇవిగాక ఎన్ని ప్రాకృతిక విపత్తులో? సామాజిక విప్లవాలో?

దీన్నంతా "చరిత్ర" అనుకుంటే ఇందు నుంచి ఏ ఒక్కరిని విడదీసి చూడలేము. గుంపులని, తెగలని, జాతులని, కులాలని, మతాలని, సంస్కృతులని, దేశాల్ని మనల్ని మనం ఎంత విడదీసుకున్నా లోతుల్లోకి పోతే మనమంతా కలిసే ఈ చరిత్రను నిర్మించుకున్నాం. మనలో ఒకరు భీరులూ లేరు, మరొకరు మహా వీరులూ లేరు. ఒకరు పరాజితులు, ఇంకొకరు విజేతలు కూడా లేరు. విస్తరణలో, వెతుకులాటలో తప్ప వీటిలో ఆక్రమణలూ లేవు అధిపత్యాలూ లేవు. ఏది మంచో ఏది చెడ్డో విడదీయలేము. ఏది పురోగమనమో, ఏది తిరోగమనమో చెప్పలేము. ఏది అభివృద్ధో, ఏది కాదో తీర్పునివ్వలేము. మనం స్తబ్దంగానే వున్నామో, పరిగెత్తుతున్నామో అర్థం కాదు.

మన కళ్ళ ముందే మహా నాగరికతలు కనుమరుగయ్యాయి. నియంతలూ, చక్రవర్తులూ అనామకులయ్యారు. తత్వవేత్తలు కాలం చెల్లిన వాళ్ళయ్యారు. వాస్తవంగా గోచరిస్తున్నది ఒక్కటే కాల ప్రవాహం! అన్నిటినీ, అందరినీ గర్భస్థం చేసుకోగల అనంత కాల ప్రవాహం.

ఈ మహా ప్రయాణంలో అక్కడక్కడ మజిలీలు. అప్పుడప్పుడు మలుపులు. ఇవే మనకు మిగిలిన కొండ గుర్తులు. వాటి చుట్టూనే మనం భ్రమిస్తుంటాం. అడపాదడపా ఆవేశపడుతుంటాం. మధ్య మధ్యలో నిరాశ చెందుతుంటాం. ఉత్తేజాల నిర్వేదాల ఉయ్యాలలో ఈ చివరకు ఆ చివరకు ఊగుతుంటాం. "ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు" అంటూ వేదనా గీతికలు పాడుతుంటాం. అయినా మనిషికి అంతర్గతంగా ఏ ప్రాణికి లేని అవసరాలున్నాయి. జ్ఞాన తృష్ణ వుంది. అన్వేషణా దాహం వుంది. వాటికి తోడుగా సాహసాలు, త్యాగాలు వున్నాయి. అన్నిటి కంటే మించి అత్యద్భుతమైన ఉమ్మడితనం వుంది. ఇచ్చి పుచ్చుకోవడాలున్నాయి.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవం విస్తరిస్తున్న కొద్దీ, మనిషి జోక్యానికి హద్దులు అంతరిస్తున్న కొద్దీ మానవుడిలో కాలాన్ని సవాలు చేయగలనన్న ధీమా పెరుగుతోంది. తన పయనంలో పరమాణు భాగం కూడా పూర్తికాలేదన్న స్పృహ అతనికి నిద్ర లేకుండా చేస్తోంది. ఈ క్రమంలో అతడు గతాన్ని మరింత తెలివితో, హేతుబద్ధంగా బేరీజు వేయగలడు. సంకుచిత, చాందస ధోరణులన్నిటిని క్రమంగా తిరస్కరించగలడు. శకలీకరణను తోసి రాజని సకలీకరణ వైపు నిగ్రహంతో పయనించగలడు. ప్రకృతితో తన బంధుత్వానికి కొత్త భాష్యం చెప్పుకొని 'ఆకులో ఆకుగా, పువ్వులో పువ్వుగా' మారగలడు. పరాయీకరణ నుంచి సర్వ స్వతంత్రుడిగా మేలుకోగలడు. ఒక మహోన్నత మానవ ప్రపంచం వైపు నిశ్చయంగా అడుగులు వేయగలడు. అయినా కాలం ప్రవహిస్తూనే ఉంటుంది. అన్నిటిని కడుపులో నిర్మమకారంగా దాచుకుంటూనే వుంటుంది. కొత్త తరానికి పాఠాలు చెబుతూనే వుంటుంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

ఒబెరాయ్ కోసం మళ్లీ భూ సేకరణ

- దిబ్బలపాలెం నుంచి తూడెం వెళ్లే రహదారి విస్తరణ
- 80 అడుగులతో వెడల్పు చేసేందుకు నిర్ణయం

ప్రజాశక్తి-భోగాపురం (విజయనగరం)

భోగాపురం సరిహద్దుల్లో.. విమానాశ్రయానికి దగ్గరలో సముద్ర తీరాన కొత్తగా నిర్మిస్తున్న ఒబెరాయ్ హోటల్ రహదారి కోసం మండలంలోని రెండు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూసేకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. దిబ్బలపాలెం గ్రామం నుంచి తూడెం వెళ్లే రహదారిలో రెండు కిలో మీటర్ల రహదారిని వెడల్పు చేయనున్నారు. దీనికి అవసరమైన భూమిని సేకరించనున్నట్లు సమాచారం. ఈ రహదారిని టూరిజం శాఖ ఆధ్వర్యంలో వెడల్పు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. దీంతో రైతులు ఎంతో విలువైన భూములను కోల్పోయే పరిస్థితి ఉంది. ఇప్పటికే విమానాశ్రయం కోసం 2700 ఎకరాలు గతంలో భూసేకరణ చేయడంతో చాలా మంది రైతులు భూములను కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా ఒబెరాయ్ హోటల్ రహదారి కోసం భూసేకరణ చేస్తుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సముద్ర తీరాన విలువైన 30 ఎకరాలు భూమిని ఒబెరాయ్ హోటల్ కోసం కేటాయించింది. ఈ భూమి మండలంలోని కంచేరు రెవెన్యూ సర్వే నెంబరులో విశాఖజిల్లా అన్నవరం రెవెన్యూలో ఉంది. ఈ భూమిలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఒబెరాయ్ సంస్థ సిద్ధమవుతోంది. కాని ఈ భూమిలోకి నిర్మాణ సామాగ్రి వెళ్లాలంటే సరైన రహదారి సౌకర్యం లేదు. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు రహదారి సౌకర్యం కల్పించాలని రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులను కోరారు. ఈనేపథ్యంలో ఇటీవల ఆ శాఖ అధికారులతో పాటు విశాఖ వీఎంఆర్‌డిఎ, రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించారు.

రెండు రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ

చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం నుంచి తూడెం వెళ్లే రహదారిలో ప్రస్తుతం ఈ ఒబెరాయ్ హోటల్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి చాలా చిన్నదిగా ఉండడంతో పాటు మట్టిరోడ్డు కావడంతో భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. మరోవైపు, దిబ్బలపాలెంలో ఈ రహదారి మరీ ఇరుకుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భూసేకరణ చేసి రహదారిని వెడల్పు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు భూమి రికార్డులు వెల్లడిస్తూ అధికారులు భూసేకరణ ప్రతిపాదనలు కోరారు. ఈ రహదారిని 20 అడుగులతో వెడల్పు చేస్తే కంచేరు, కంచేరుపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు మూడున్నర ఎకరాలు, 40 అడుగుల వెడల్పుతో అయితే ఆరున్నర ఎకరాలు, 80 అడుగులతో వెడల్పుతో చేస్తే సుమారు 13 ఎకరాలు భూమిని భూసేకరించాల్సి ఉంటుంది. కాని ఈ రహదారి 80 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఎందుకంటే రానున్న రోజుల్లో ఈ రహదారి గుండా విమానాశ్రయానికి వెళ్లేందుకు ఆ సంస్థకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఉన్న తూడెం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లుతో పాటు అక్కడ ఉన్న భూముల విలువతో సహా పూర్తి నివేదికను పర్యాటక శాఖకు జిల్లా అధికారులు నివేదించినట్లు సమాచారం.


ఒబెరాయ్ హోటల్ కోసం సముద్ర తీరాన కేటాయించిన స్థలం

తులసిబాబు కేసులో రఘురామ ఇంప్లీడ్ పిటిషన్ అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

బెయిల్ ఇవ్వాలంటూ కామేపల్లి తులసిబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లో శాసనసభ డిప్యూటీ స్పీకరు కనుమూరి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌నుహైకోర్టు అనుమతి ఇచ్చింది. తులసిబాబు పిటిషన్‌లో రఘురామను ప్రతివాదిగా చేర్చి వాదనలు వినేందుకు అనుమతి ఇస్తూ జస్టిస్ కె మహేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసిపి అధికారంలో ఉండగా తనపై పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ పేరుతో చిత్రహింసలకు గురిచేశారంటూ రఘురామ చేసిన ఫిర్యాదు మేరకు గుంటూరు, నగరపాలెం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో తులసిబాబును పోలీసులు అరెస్టు చేయడంతో బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. తులసిబాబును కస్టడీకి ఇవ్వాలని కింది కోర్టులో పిటిషన్ వేసినట్లు పిపి పోసాని వెంకటేశ్వర్లు తెలిపారు. రఘురామ తరపున న్యాయ వాది వివి లక్ష్మీనారాయణ విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇంప్లీడ్ పిటిషన్ వేసి వాయిదా కోరడం అన్యాయమని తులసిబాబు తరపున సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి అన్నారు. దీంతో విచారణ సోమవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

వివాదం పరిష్కరించుకోండి లేకపోతే మేమే పరిష్కరిస్తాం

- తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్‌లకు సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ: తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ మధ్య నెలకొన్న వివాదాలను వారిరువురే పరిష్కరించుకోవాలని, లేకపోతే తాము జోక్యం చేసుకుని పరిష్కరిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. తమిళనాడులోని విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల (విసి) నియామకంపై సిఎం స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రభుత్వం, గవర్నర్ ఆర్ఎన్ రవి మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతున్నది. గవర్నర్ విసిగా వ్యవహరించే అధికారాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతోపాటు పలు నియామకాల్లో గవర్నర్ అధికారాలను పరిమితం చేసింది. ఈ బిల్లులను ఆమోదించడానికి ఆర్ఎన్ రవి నిరాకరించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం, భారతియార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు ఉపాధ్యాయ శిక్షణ విశ్వవిద్యాలయాలకు వైస్-ఛాన్సలర్లను నియమించడానికి గవర్నర్ రవి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ చర్య చట్టవిరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వం విమర్శించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి సభ్యులను తొలగించడంతోపాటు ఆ కమిటీని పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌బి పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఇరువురు కలిసి బిల్లుల పెండింగ్ వివాదాన్ని పరిష్కరించుకోవడం మంచిదని సూచించింది. లేనిపక్షంతో ఈ సమస్యను తాము పరిష్కరిస్తామని కోర్టు హెచ్చరించింది.

ఆరుగురి హత్య కేసులో భార్యాభర్తలకు మరణశిక్ష

లక్నో : ఆరుగురు కుటుంబ సభ్యులను హత్య కేసులో దోషులుగా నిర్ధారణ అయిన జంటకు మరణశిక్ష విధిస్తూ లక్నో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోకు చెందిన అజయ్‌సింగ్, అతని భార్య రూపాసింగ్ 2020లో ఈ దారుణానికి పాల్పడ్డారు. అజయ్‌సింగ్ తల్లిదండ్రులు రామ్ దులారి, అమర్‌సింగ్, సోదరుడు అరుణ్‌సింగ్, వదిన రామ్‌సఖి, వారి పిల్లలు సౌరభ్, సారికలను వీరు కాల్చి చంపారు. అజయ్‌సింగ్ సోదరి దుర్గావతి ఫిర్యాదు మేరకు బంత్రా పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. భూమిని అమ్మిన డబ్బు మొత్తం అన్నావదినలకు ఇస్తాడేమోనన్న అనుమానంతో తండ్రితోపాటు కుటుంబ సభ్యులందరినీ హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. గత ఏడాది డిసెంబర్ 16న అజయ్‌సింగ్, రూపాసింగ్‌లను దోషులుగా లక్నో కోర్టు నిర్ధారించింది. వారికి మరణశిక్షను శుక్రవారం ఖరారు చేసింది.

సిక్కుల చరిత్రను వక్రీకరిస్తారా?

- 'ఎమర్జెన్సీ' ప్రదర్శనకు వ్యతిరేకంగా పంజాబ్‌లో నిరసనలు

చండీగఢ్ : ప్రముఖ బాలీవుడ్ నటి, బిజెపి ఎంపి కంగనా రనౌత్ తాజాగా నటించిన 'ఎమర్జెన్సీ' చిత్ర ప్రదర్శనను వ్యతిరేకంగా పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిరసనలు వెల్లువెత్తాయి. పలువురు కాంగ్రెస్ నేతలు, రైతు సంఘాల నేతలు, సిక్కు మతానికి చెందిన వారు ఈ చిత్ర ప్రదర్శనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. దేశంలో సోదరభావాన్ని దెబ్బతీసే విధంగా ఈ చిత్రాన్ని తీశారని వారు విమర్శించారు. 1984 నాటి ఘటనలను వక్రీకరించే రీతిలో 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని తెరకెక్కించడం వల్లే... ఆందోళనలు చేపట్టినట్టు శిరోమణి గురుద్వారా పర్బంధర్ కమిటీ (ఎస్‌జిపిసి) పేర్కొంది. పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ మాట్లాడుతూ.. వాస్తవాలను, చరిత్రను వక్రీకరించే రీతిలో ఇలాంటి సినిమాలు తీయడం సరికాదని అన్నారు. మొహాలి, జిరాక్‌పూర్‌లోని ధిల్లాన్ ప్లాజా, కాస్మో ప్లాజాలో ఉన్న సినిమా థియేటర్ల వద్ద సింధూపూర్ నుండి వచ్చిన రైతు సంఘాల నేతలు నిరసన తెలిపారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదికిపైగా ఉద్యమంలో పాల్గొన్న రైతులను కంగనా అవమానించారని రైతు సంఘాల నేతలు విమర్శించారు.

వైట్‌హౌస్‌పై దాడికి యత్నించిన కేసులో సాయి వర్షిత్‌కు 8 ఏళ్ల జైలుశిక్ష

వాషింగ్టన్ : వైట్‌హౌస్‌పై దాడికి యత్నించిన కేసులో భారత సంతతికి చెందిన సాయి వర్షిత్ కందుల (20)కి గురువారం ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించినట్లు న్యాయశాఖ గురువారం ప్రకటించింది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అమెరికా ప్రభుత్వాన్ని కూలదోయడమే లక్ష్యంగా ఈ దాడి జరిపాడని, నాజీ భావజాలంతో నియంతృత్వానికి ఆజ్యం పోసేందుకు యత్నించాడని డిస్ట్రిక్ కోర్ట్ జడ్జి డాబ్నీ ఎల్‌ఫ్రెడ్రిచ్ పేర్కొన్నారు. అతడి చర్యల వల్ల ధ్వంసమైన నిర్మాణాలను తొలగించేందుకు, పునర్‌నిర్మించేందుకు యుఎస్‌డి 4,322 డాలర్లు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. 2023 మే 22న వైట్‌హౌస్‌పై అద్దె ట్రక్కుతో సాయి వర్షిత్ దాడికి యత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం, దోచుకున్నారనే అభియోగాలను నిందితుడు గతేడాది మేలో అంగీకరించినట్లు పోలీసులు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ వర్గాలు తెలిపాయి. దాడికి కొన్ని వారాల ముందే ప్లాన్ చేసినట్లు పేర్కొన్నాయి. భారత్‌లోని చందానగర్‌లో జన్మించిన అతను గ్రీన్‌కార్డ్‌తో అమెరికాలో చట్టబద్ధంగా శాశ్వత నివాసాన్ని పొందారు. కోర్టు పత్రాల ప్రకారం.. 2023 మే 22 సాయంత్రం మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నుండి సాయి వర్షిత్ వాషింగ్టన్ డిసికి చేరుకున్నాడు. సాయంత్రం 6.30 గంటలకు ఓ ట్రక్కును అద్దెకు తీసుకున్నాడు. రాత్రి 9.35 గంటలకు వైట్‌హౌస్‌కు చేరుకుని ఫుట్‌పాత్‌పై వాహనాన్ని నడిపాడు. పాదచారులు భయాందోళనలతో పరుగులు తీశారు. అనంతరం వైట్‌హౌస్ ఉత్తర భాగం వైపు భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బారియర్స్‌ను ఢీకొట్టాడు. ట్రక్కును రివర్స్ చేసి మరోసారి బారియర్స్‌పైకి దూసుకువెళ్లాడు. ఇంజిన్ నుండి పొగరావడం, పెట్రోల్ లీక్ కావడంతో ట్రక్కును నిలిపివేశాడు. అనంతరం నాజీ జెండాను పట్టుకుని నినాదాలు చేశాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతనిని అదుపులోకి తీసుకున్నారు.

నూతన గోదాముల నిర్మాణం : గిడ్డంగుల సంస్థ ఎమ్‌డి

ప్రజాశక్తి - ఆమదాలవలస, పొందూరు

రాష్ట్రంలో స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ ఆధ్వర్యాన ఉన్న గోదాములతో పాటు సామర్థ్యం పెంపు కోసం నూతన గోదాములు నిర్మించనున్నట్లు రాష్ట్ర గిడ్డంగులు, గోదాముల సంస్థ ఎమ్‌డి జి.సురేష్ కుమార్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస, పొందూరు మండల కేంద్రాల్లో స్టేట్ వేర్ హౌస్ గోదాములను శుక్రవారం పరిశీలించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎఫ్‌సి ద్వారా బియ్యం సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదాముల నిర్వహణ, కార్యాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా వినియోగంలో విఫలం

- మంత్రులు, ఎంపిలపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో సోషల్ మీడియాను సక్రమంగా వినియోగించుకోవడంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. మంత్రులు, పార్టీ ఎంపిలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రులు, ఎంపిలు, జోనల్ కో-ఆర్డినేటర్లతో ఉండవల్లిలోని తన నివాసంలో సిఎం శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఐటి నిపుణుడైన సోషల్ మీడియా వినియోగంలో ఎందుకు వెనకబడ్డారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సిఎం ప్రశ్నించినట్లు తెలిసింది. మంత్రి ఫరూక్ కూడా చివర స్థానంలో ఉన్నారని ఆక్షేపించినట్లు సమాచారం. సోషల్ మీడియా వినియోగం పెంచాలని చెప్పారు. కేంద్ర నిధుల సాధనలో ఎంపిలు, మంత్రుల మధ్య సమన్వయం మరింత పెరగాలని సిఎం దిశానిర్దేశం చేశారు. ప్రతి పార్లమెంటు పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎంపి, ఇన్‌ఛార్జి మంత్రి, జోనల్ ఇన్‌ఛార్జి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే తప్పు చేస్తే ఇన్‌ఛార్జి మంత్రిదే బాధ్యత అని తేల్చి చెప్పారు. జిల్లాలో పథకాల అమలు తదితర అంశాల ఆధారంగా సిఎం ర్యాంకులు ప్రకటించినట్లు సమాచారం. తొలి మూడు స్థానాల్లో కృష్ణా, చిత్తూరు, ఎన్‌టిఆర్ జిల్లాలు ఉండగా, చివరి స్థానాల్లో కడప, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాలు ఉన్నాయని తెలిపారు. కలెక్టర్, తహశీల్దార్, ఆ కింది స్థాయి అధికారులు అర్జీలు, దస్త్రాలను పరిష్కరించకుండా తమ పరిధి నుంచి పంపేయడం సరికాదని సిఎం అభ్యంతరం చెప్పినట్లు తెలిసింది. వీటిని ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అధికారులు వాటిపై కారణం రాసే విధానం తీసుకురావాలని, దీనివల్ల జవాబుదారీతనం పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 53 శాతం అనుకూల ఓటింగ్‌ను 60 శాతానికి తీసుకెళ్లాలని చెప్పారు. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో తనకు కావాల్సింది ఫోటోలు కాదని, ఫలితాలని చెప్పారు. సమావేశానికి కొందరు ఎంపిల గైర్హాజరుపై టిడిపి పార్లమెంటరీ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలును ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీ సమావేశాల కంటే ఇతర కార్యక్రమాలు ఎక్కువయ్యాయా అని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

బిఎస్‌ఎఫ్ జవానుకు అశ్రు నివాళి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

బిఎస్‌ఎఫ్ జవాను తలమర్ల వెంకటరమణారెడ్డికి పట్టణ ప్రజలతోపాటు పోలీస్ అధికారులు, కేంద్ర బలగాలు అశ్రు నివాళులర్పించారు. కాశ్మీర్‌లో విధుల నిర్వహిస్తుండగా గుండెపోటుకు గురై మరణించిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని కాశ్మీర్ నుండి ఢిల్లీకి అక్కడి నుంచి బెంగళూరుకు, బెంగళూరు నుండి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్మీ వాహనంలో ధర్మవరానికి శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలకు తీసుకువచ్చారు. దేశ సేవ చేయాలన్న తలంపుతోనే ఆర్మీలో చేరిన తలమర్ల వెంకటరమణారెడ్డి ఇంకొన్ని రోజుల్లో రిటైర్డ్ అయి వస్తాడన్న ఆశతో ఎదురు చూసామని అంతలోనే ఇలా జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బసినేపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కౌన్సిల్ భేటీకి అధికారుల విముఖత

- గుంటూరులో మేయర్, కార్పొరేటర్ల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కమిషనర్, వైసిపి కార్పొరేటర్లకు ఏర్పడిన వివాదం నేపథ్యంలో కౌన్సిల్ భేటీకి అధికారులు విముఖత చూపుతున్నారని గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. మేయర్, కార్పొరేటర్లు శుక్రవారం కౌన్సిల్ హాలు బయట నిరసన వ్యక్తం చేశారు. మీడియాతో మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడారు. కమిషనర్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై సభ్యులు ప్రశ్నలు అడగడంతో అసహనం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి కమిషనర్, అధికారులు బాయ్‌కాట్ చేశారని తెలిపారు. సమావేశం జరిపించాలని ఈనెల ఏడున అధికారులకు లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. గతేడాది సెప్టెంబరు ఒకటిన బుడమేరు వరదల వచ్చిన వరదల నేపథ్యంలో విజయవాడ బాధితులకు ఆహారపానీయాల నిమిత్తం గుంటూరు కార్పొరేషన్ నుంచి రూ.9.24 కోట్లు ఖర్చు చేశారని, ఇందుకు కౌన్సిల్ ఆమోదం పొందలేదన్నారు. ఈ నిధుల వినియోగంలో భారీ అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వరద సమయంలో నిధుల వినియోగం అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినందున కమిషనర్ అవినీతిపై ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ అక్రమాలు బయటకు వస్తాయనే కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తాము ఏడవ తేదీన సమావేశం నిర్వహించాలని లేఖ రాస్తే, స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చినందున సమావేశం నిర్వహించడం కుదరదని కమిషనర్ చెప్పడం సరికాదన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు పూర్తయ్యేలోగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వస్తుందని, మార్చి చివరి వరకు సమావేశం నిర్వహించకుండా కాలయాపన చేయవచ్చునని కమిషనర్ ఎత్తుగడ వేశారని ఆరోపించారు. ఈ అంశంపై కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2020-24లో జరిగిన అవినీతిపై విచారణ చేస్తున్నందున తనపై మేయర్ ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సీనియర్ ఐఎఎస్ అధికారుల సూచన మేరకు కార్పొరేషన్ నిధులతో అత్యవసరంగా ఆహార పానీయాలు కొనుగోలు చేసి పంపామని, రూ.ఏడు కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు చేయడం దారుణమన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మేయర్, పక్కన వైసిపి కార్పొరేటర్లు


అంతరాలయ దర్శనాలకు అవాంతరాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల నిర్లక్ష్య ధోరణి, అవగాహన లోపానికి మరో నిదర్శనం అంతరాలయ దర్శనం టికెట్. స్వామి అమ్మవార్ల అంతరాలయంలోకి వెళ్లే దర్శనం చేసుకోవడానికి 500 రూపాయల టికెట్లు కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆధార్ కార్డు కలిగిన యాత్రికులకు మాత్రమే టికెట్లను విక్రయించారు. అయితే అంతరాలయ దర్శనం అమలులో ఎన్నో ఇబ్బందులున్నాయి. వీటిని అధికారులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి 500 రూపాయల టికెట్ల విక్రయాన్ని దేవస్థానం ప్రారంభించింది. మధ్యాహ్నానికి 50 మంది యాత్రికులు టికెట్లను కొనుగోలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. టికెట్లు కొనుగోలు చేసిన యాత్రికులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయలేదు. స్వామివారి ధ్వజస్తంభం నుంచి సర్వ దర్శనం క్యూలో వెళ్లి దర్శించుకోవాల్సి వచ్చింది. దీనిపై సిబ్బందికి కూడా పూర్తి సమాచారం లేదు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన వారిని మాత్రమే అంతరాలయంలోకి పంపడం జరిగింది.

పెట్టుబడి సాయం ఏదీ..?

- రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- హామీ అమలు పట్టించుకోని వైనం
- రైతుల ఎదురు చూపులు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎటువంటి నిబంధనలు పెట్టకుండానే రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు పలు సభల్లో హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పైనే కావస్తున్నా నేటికీ రైతుల సంక్షేమంపై కనీసం పట్టించుకోవడం లేదు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఉదరగొట్టిన సిఎం, డిప్యూటీ సిఎం హామీలపై ఇప్పుడు నోరు మెదపకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి సాయంపై కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంపై రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఎపిలో 'అన్నదాత సుఖీభవ' పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా పెట్టుబడి సాయంపై ప్రకటన చేశారు. సంక్రాంతి తర్వాత అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని ప్రకటించారు.

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం అన్నదాతలను ఆదుకుంటుందని పాలకులు ప్రకటనలు ఇస్తున్నా ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. పంట పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో చిక్కుకోకూడదనే ఉద్దేశ్యంతో రైతుభరోసా సాయం అందించామని గత ప్రభుత్వం చెప్పుకొంది. ఈ నేపథ్యంలో కేంద్రం సాయంతో కలుపుకుని రూ.13,500 ఇచ్చేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాయంపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. దీంతో ఇప్పుడు చేయి చాచి అప్పులు అడిగే పరిస్థితిలోకి వెళ్ళాల్సి వచ్చిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలోనే సొమ్ములు వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నా హామీ ప్రకారం ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి సాగు పనులు చేపడుతున్నారు. ఖరీఫ్ పూర్తయి, రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ అందించే సాయంపై కనీసం ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏటా మూడు విడతలుగా సాయం అందించగా ఈ ప్రభుత్వం నేటికీ ఊసెత్తకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలె త్తుతున్నాయి. ఇప్పటికే కేంద్రం రెండు విడతల్లో రూ.4 వేలు అందించగా దానితో సంబంధం లేకుండా ఇస్తామన్న రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారని రైతులు స్థానిక ప్రజాప్రతినిధులను అడుగుతున్నారు. వాస్తవానికి కేంద్రం పిఎం కిసాన్ పేరిట మూడు విడతల్లో రైతులకు ఏడాదికి రూ.6 వేలు ఈ పెట్టుబడి సాయం అందిస్తుండగా ఎపిలో మాత్రం పథకాల అమలుపై ఇంకా స్పష్టతకు రాలేదని తెలుస్తోంది. అయితే అన్నదాత సుఖీభవ, రైతు భరోసా పథకాల అమలు కోసం పలువురు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం కౌలు రైతుల్లో ఒసిలకు పెట్టుబడి సాయాన్ని ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతులందరికీ ఎలాంటి నిబంధనలూ లేకుండా సాయం అందించాలని కోరుతున్నారు. పథకం విధి విధానాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే సాయం అందించాలి

అధికారంలోకి వచ్చిన వెంటనే జూన్‌లోనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికలప్పుడు చంద్రబాబు ప్రకటించారు. ఎటువంటి షరతులు లేకుండా రూ.20 వేలు ఇస్తామని చెప్పుకొచ్చారు. నేటికీ దాని ఊసే లేదు. సాగు సీజన్లు పూర్తి కావస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలి. లేకుంటే ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తాం.

- తిరుమలశెట్టి నాగేశ్వరరావు,
ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

సెమీస్‌కు సాత్విక్-చిరాగ్

క్వార్టర్స్‌లో ఓడిన సింధు, కిరణ్



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌ఫైనల్‌కు చేరిన పివి సింధు, కిరణ్ జార్జి ఓటమిపాలవ్వగా.. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-10, 21-17తో కొరియాకు చెందిన యంగ్-జిన్, కాంగ్-మిన్‌లను చిత్తుచేశారు. తొలిసెట్‌ను ఏకపక్షంగా ముగించిన భారత షట్లర్ల బృందం.. రెండో గేమ్‌ను చేజిక్కించుకొనేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ సుమారు 41 నిమిషాల సేపు సాగింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ 9వ స్థానంలో ఉండగా.. కొరియా జంటను ఏ దశలోనూ పుంజుకొనేందుకు అవకాశం ఇవ్వలేదు. ఇక పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి 13-21, 19-21తో చైనాకు చెందిన వాంగ్ హంగ్ యంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇక పివి సింధు 9-21, 21-19, 17-21తో ఇండోనేషియాకు చెందిన గ్రెగోరియా మరిస్కా చేతిలో పోరాడి ఓడింది.

అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

- చీఫ్ జస్టిస్‌కు సీనియర్ న్యాయవాదుల లేఖ



శేఖర్ కుమార్ యాదవ్

న్యూఢిల్లీ : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ కుమార్ యాదవ్ చేసిన మతోన్మాద వ్యాఖ్యలను సుమోటోగా పరిగణనలోకి తీసుకుని ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాల్సిందిగా సిబిఐని ఆదేశించాలని సీనియర్ న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాకు శుక్రవారం లేఖ రాశారు. గత నెల 8వ తేదీన విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీం కోర్టు సెక్రటరీ జనరల్‌కు పిటిషన్‌ను, ఇతర సీనియర్ న్యాయమూర్తులకు పిటిషన్ కాపీలను అందజేశారు. రెండు మతాల మధ్య వున్న తీవ్రమైన తేడాలను ఎత్తిచూపుతూ ఆయన వ్యాఖ్యలు చేశారని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. న్యాయపరమైన నిష్పాక్షికతను గాలికి వదిలి విచ్ఛిన్నకరమైన రీతిలో దారుణంగా వ్యాఖ్యలు చేశారని వారు పేర్కొన్నారు. తాను ఒక మతానికి చెందిన వాడినని చెప్పుకుంటూ మరో మతాన్ని అప్రతిష్టకరమైన రీతిలో చూపించేందుకు ప్రయత్నించారని వారు ఆ లేఖలో తెలిపారు. ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా యాదవ్ వ్యాఖ్యలు వున్నాయని పేర్కొన్నారు. రెండు మతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా ఆయన ధోరణి వుందని లేఖ పేర్కొంది. జస్టిస్ యాదవ్ ఆ ఆరోపణలన్నింటినీ తిరస్కరిస్తున్నారు. తన వ్యాఖ్యలకు వక్ర బాష్యాలు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. అంతకుముందు ఆయన సుప్రీం కోర్టు కొలీజియం జడ్జిలను కూడా కలిశారు భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపి సిట్టింగ్ న్యాయమూర్తులపై క్రిమినల్ చర్యలు చేపట్టే విషయాన్ని సుప్రీం కోర్టు చేపట్టాలని ఆ లేఖలో న్యాయవాదులు కోరారు.

ఢిల్లీ హైకోర్టు 'ఆయుష్మాన్ భారత్' ఆదేశాలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం అమలు కోసం కేంద్రప్రభుత్వంతో ఢిల్లీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవాలని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. పిఎం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పిఎం - అభీమ్)లో భాగంగా ఉన్న ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేసేందుకు ఆప్ ప్రభుత్వం నిరాకరించింది. ఈ పథకాన్ని ఢిల్లీలో అమలు చేయడానికి ఈ నెల 5లోగా కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖతో అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకాలు చేయాలని డిసెంబర్ 24న ఆప్ ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలపై ఆప్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. కేంద్రం, ఇతరుల స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసింది.

ఆయుష్మాన్ భారత్ అతి పెద్ద స్కామ్ : కేజ్రీవాల్

ఆయుష్మాన్ భారత్ అతి పెద్ద స్కామ్ అని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. కేంద్రంలో ప్రభుత్వం మారి దర్యాప్తు చేపడితే ఆయుష్మాన్ భారత్ పథకంలో జరిగిన భారీ అవినీతి గురించి ప్రజలకు తెలుస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు తాజా ఉదేశాల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

ఆప్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే.. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం ప్రకటించారు. మెట్రో రైలులో ప్రయాణించేందుకు విద్యార్థులకు ఛార్జీలలో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ ఆయన మోడీకి లేఖ రాశారు.

అల్ ఖదీర్ ట్రస్టు కేసులో ఇమ్రాన్ దంపతులకు జైలు

- న్యాయవ్యవస్థ ప్రతిష్ట దిగజారిందన్న పిటిఐ నేత

ఇస్లామాబాద్ : దాదాపు 19 కోట్ల పౌండ్లకు పైగా అవినీతి చోటు చేసుకుందన్న అల్ ఖదీర్ ట్రస్టు కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలను పాకిస్తాన్ కోర్టు దోషులుగా నిర్ధారించింది. వారిరువురికి వరుసగా 14 ఏళ్ళు, ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు ఈ కేసులో తీర్పును మూడుసార్లు వాయిదా వేస్తూ వచ్చారు. శుక్రవారం అవినీతి నిరోధక న్యాయస్థానం న్యాయమూర్తి నాజిర్ జావేద్ రాణా తీర్పు చెబుతూ జైలుశిక్షలతో పాటు ఖాన్‌కు 10 లక్షల రూపాయలు, బుష్రా బీబీకి 5లక్షల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించడంలో విఫలమైతే మరో ఆరుమాసాలు ఖాన్, మరో మూడు మాసాలు బీబీ అదనంగా జైలుశిక్షను అనుభవించాల్సి వుంటుంది. వారు ఏర్పాటు చేసిన అల్ ఖదీర్ యూనివర్శిటీ భూమిని జప్తు చేసుకోవాల్సిందిగా కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖాన్ ఇప్పటికే జైల్లో వుండగా, బుష్రాను కోర్టులోనే అరెస్టు చేశారు. ఈనాటి తీర్పుతో దేశంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ట దిగజారిందని ఖాన్ విమర్శించారు. తాను లాభపడింది లేదని, ప్రభుత్వం కోల్పోయింది లేదని వ్యాఖ్యానించారు. ఖాన్, బీబీలతోపాటు మరో ఆరుగురిపై నేషనల్ అక్కౌంటబిలిటీ బ్యూరో కేసు దాఖలు చేయగా, మిగిలిన వారందరూ దేశం వీడి వెళ్లడంతో వీరిద్దరిపైనే విచారణ జరిగింది. ఈ కేసులో దేశ ఖజానాకు ఐదు వేల కోట్ల రూపాయలు (19 కోట్ల పౌండ్లు) నష్టం జరిగిందని అకౌంటబులిటీ బ్యూరో నేరాభియోగాన్ని మోపింది.





జ్యోతిబసు సోషల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రకాశ్‌కరత్, హాజరైన ప్రజలు

మతతత్వ శక్తులపై సైద్ధాంతిక పోరు

- జ్యోతిబసు రీసెర్చ్ సెంటర్ ప్రారంభ సభలో ప్రకాశ్ కరత్ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అత్యంత అనాగరికులని జ్యోతి బసు విమర్శించిన వారే నేడు కేంద్రంలో అధికారం చెలాయిస్తున్నారని, ఈ మత ఛాందసవాద శక్తులపై ఎన్నికల ద్వారానే కాకుండా సైద్ధాంతికంగా పోరాడాలని సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్ కరత్ పిలుపునిచ్చారు. కొల్‌కతాలోని జ్యోతిబసు నగర్ (న్యూటౌన్)లో జ్యోతిబసు సోషల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్ రెండంతస్తుల భవనంలో మొదటి దశను ఆయన శుక్రవారం ప్రారంభించారు. సరిగ్గా ఏడాది క్రితం జనవరి 17న ఈ భవనానికి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి శంకుస్థాపన చేశారు. ఇటీవల కన్నుమూసిన కమ్యూనిస్టు యోధులు సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్యలను వక్తలు గుర్తు చేసుకున్నారు. సెంటర్ ఛైర్మన్ బిమన్ బసు అధ్యక్షతన జరిగిన సభలో ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ.. జ్యోతిబసు సోషల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌తో సామాజిక అధ్యయనాలు, పరిశోధనలు శ్రామిక ప్రజల విముక్తి కోసం పోరాటానికి, దేశ లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పోరాటానికి వనరులను అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జ్యోతి బసు పేరు మీద ఉన్న ఈ కేంద్రం చేసే పరిశోధన ఆధారిత పనులు కార్మికుల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి సహాయపడతాయని కరత్ అన్నారు. 'జ్యోతిబసు అనాగరికులని పిలిచే వారు అప్పుడు తలుపు వద్ద ఉన్నారు. ఇప్పుడు వారు అధికారంలో ఉన్నారు ' అని పేర్కొన్నారు.. దేశంలో వామపక్ష ఉద్యమానికి ప్రతీకగా ఆయన నిలిచారని అన్నారు. జ్యోతిబసు సోషల్ స్టడీస్, రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిపిఎం బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, దేశవ్యాప్తంగా ఉన్న సిపిఎం నాయకులతో పాటు రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. విద్యావేత్తలు, న్యాయవాదులు, కళా, సాంస్కృతిక ప్రపంచానికి చెందిన పలువురు ప్రముఖులు, జ్యోతి బసు అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖ సంగీత కళాకారిణి రెజ్వానా చౌదరి బన్యా ప్రత్యేక అతిథిగా ప్రదర్శన ఇచ్చారు. జ్యోతిబసు సెంటర్ ఫర్ సోషల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ప్రచురించిన మొదటి రెండు మోనోగ్రాఫ్‌లను, జ్యోతి బసు స్మారక డైరీని కరత్ ఆవిష్కరించారు.

ఢిల్లీ ఓటర్ల జాబితాలో అవకతవకలపై దర్యాప్తు చేపట్టాలి

- ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ లేఖ

న్యూఢిల్లీ : ఢిల్లీలో ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆరోపణలు చేసిన నేపథ్యంలో వాటిపై అత్యవసరంగా దర్యాప్తు జరపాలని ప్రభుత్వ మాజీ కార్యదర్శి, సామాజిక కార్యకర్త ఇఎఎస్ శర్మ కోరారు. ఈ మేరకు ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఒక లేఖ రాశారు. దర్యాప్తు వల్ల మాత్రమే ఇటువంటి ఆరోపణల వెనుక గల వాస్తవాలు బయటపడతాయని అన్నారు. ఇటువంటి అవకతవకలు ఏమైనా జరిగాయంటే ఎన్నికల కమిషన్‌పై ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుందని ఆ లేఖలో శర్మ పేర్కొన్నారు. ఆప్ చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ ఇప్పటికే కొట్టిపారేసింది. ఆప్ నేత సంజయ్ సింగ్ వెల్లడించిన సమాచారంలో ఏదైనా నిజముందని తేలినట్లైతే, అందుకు బాధ్యులైన వారిపై సంబంధిత ఎన్నికల చట్టాలు, భారత న్యాయ సంహిత నిబంధనల కింద కచ్చితంగా చర్యలు తీసుకోవాల్సి వుందని శర్మ పేర్కొన్నారు. ఆప్ నేత, ఎంపి సంజయ్ సింగ్ నాలుగు రోజుల క్రితం ఈ ఆరోపణలు చేశారు. ప్రజా జీవితంలో బాధ్యతాయుతమైన స్థానాల్లో వున్న అనేకమంది, మరికొందరి ప్రోద్బలంతో ఢిల్లీ ఓటర్ల జాబితాలో అనేక ఎంట్రీలను తప్పుగా చేర్చారని సంజయ్ సింగ్ ఆరోపించారు. ఇలా పట్టుబట్టి చేర్పించిన వారందరూ కూడా ఒకే పార్టీ బిజెపికి చెందినవారని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలు తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయని శర్మ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు అవకతవకలు, అవినీతి చోటు చేసుకోవడం నిజమేనని నిర్ధారించబడినట్లైతే మన ఎన్నికల వ్యవస్థపై అది తీవ్రమైన ప్రభావం చూపుతుందని శర్మ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణా బాధ్యతలు చూసే అందరి విశ్వసనీయత దెబ్బతింటుంద న్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారని తెలిసిందని, ఆయన రిటైరైన తర్వాత కొన్ని నెలల పాటు హిమాలయాల్లో గడపాలని, తనను తాను పరిశుద్ధుడిని (డీ టాక్సిఫై) చేసుకోవాలని భావిస్తున్నట్లు ఒక వార్తను తాను చదివానని శర్మ ఈ సందర్భంగా ఆ లేఖలో గుర్తు చేసుకున్నారు. ఆయన అలా చేయాలనుకోవడాన్ని తాను స్వాగతిస్తానన్నారు. సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ ఇప్పటికే కూలంకషంగా దర్యాప్తునకు ఆదేశించి వుంటుందని భావిస్తున్నట్లు శర్మ పేర్కొన్నారు. అలా జరగకపోతే ఎన్నికల కమిషన్ విశ్వసనీయతతో పాటు ఆ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అధికారులందరి విశ్వసనీయత కూడా దెబ్బతింటుం దని శర్మ పేర్కొన్నారు. ఎంతకైనా తెగించి ఎన్నికల్లో గెలుపొందాలనుకునే పార్టీకి ఎన్నికల్లో పాల్గొనే బృహత్తర బాధ్యతను అప్పగించరాదని వ్యాఖ్యానించారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి అవకతవకలకు పాల్పడినా వారిని ఉపేక్షిస్తున్నామంటే ఎన్నికల కమిషన్ వ్యవస్థపై ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని శర్మ తన లేఖలో స్పష్టం చేశారు.

రష్యా సైన్యంలో 16 మంది భారతీయులు గల్లంతు

మాస్కో : రష్యా సైన్యంలో పనిచేస్తున్న 16మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు రష్యా తెలియజేసిందని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఇప్పటివరకు రష్యా మిలటరీలో పనిచేస్తున్న వారిలో 12మంది భారతీయులు మరణించారని శుక్రవారం వెల్లడించింది. రష్యా సైన్యంలో మొత్తంగా 126మంది భారతీయులు పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరిలో 12మంది మరణించగా, 16మంది గల్లంతయ్యారు. మరో 96మంది భారత్‌కు తిరిగివచ్చారు. వారు రష్యా సాయుధ బలగాల నుండి డిశ్చార్జ్ అయ్యారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఇటీవలే మరణించిన బినిల్ టి.బి. అవశేషాలను భారత్‌కు రప్పించేందుకు భారత ఎంబసీ కృషి చేస్తోందని చెప్పారు. ఒక సైనికుడు గాయపడి మాస్కో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రష్యా ఆర్మీలో ఇంకా 18మంది భారతీయులు వుండగా, వారిలో 16మంది గల్లంతైనట్లు సమాచారమందిందని ఆయన చెప్పారు. మిగిలిన వారిని త్వరగా విడుదల చేసి స్వదేశానికి పంపాలని కోరుతున్నట్లు తెలిపారు.

19న మొదటి విడత బందీల విడుదల ?

- గంటల తరబడి అనిశ్చితి తర్వాత ఆమోదముద్ర వేసిన ఇజ్రాయిల్ కేబినెట్
- ఒప్పందం తర్వాత కూడా కొనసాగుతున్న దాడులు : 110మంది మృతి



కేబినెట్ సమావేశంలో నెతన్యాహు తదితరులు

జెరూసలేం, గాజా : ఇజ్రాయిల్, హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం 19వ తేదీ నుండి అమల్లోకి రానుంది. అదే రోజు మొదటి విడత బందీలు విడుదలవుతారని భావిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయం తెలిపింది. గాజా నుండి వచ్చే బందీలకు సాదరంగా స్వాగతం పలకడానికి సన్నాహాలు చేయాల్సిందిగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందానికి ఆదేశాలు జారీ చేసినట్లు నెతన్యాహు తెలిపారు. ఒప్పందం కుదిరిన విషయాన్ని బందీల కుటుంబాలకు కూడా తెలియజేయాల్సిందిగా కోరినట్లు చెప్పారు. ఈ ఒప్పందానికి ఇజ్రాయిల్ కేబినెట్ తుది ఆమోద ముద్ర లభించడానికి ముందు గంటల తరబడి అనిశ్చితి నెలకొంది. అనంతరం ప్రభుత్వం ఒక ప్రకటన జారీ చేస్తూ భద్రతా కేబినెట్, ప్రభుత్వం ఆమోదముద్ర వేశాయని, అంగీకరించిన ప్రకారం ఆదివారానికి మొదటి విడత బందీల విడుదల జరుగుతుందని ఆశిస్తున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది.

అమెరికా అధ్యక్షుడు బైడెన్, కీలక మధ్యవర్తి కతార్ ప్రధాని ఒప్పందం కుదిరిందని ప్రకటించిన మరుసటి రోజు ఒప్పందం అమలు పట్ల నెతన్యాహు పాలక సంకీర్ణంలో ఆందోళనలు తలెత్తాయి. ఈ ఒప్పందాన్ని ఆమోదిస్తే తాము రాజీనామా చేస్తామని ఇద్దరు మంత్రులు బెదిరించారు. దాంతో కేబినెట్ ఓటింగ్ ఆలస్యమైంది. కానీ, హమాస్‌తో చివరి నిముషంలో తలెత్తిన వివాదం వల్లనే కాల్పుల విరమణపై ఓటింగ్ జరపడంలో జాప్యం చేసినట్లు ఇజ్రాయిల్ వ్యాఖ్యానించింది. మధ్యవర్తులు ప్రకటించిన ఒప్పందానికి తాము కట్టుబడి వున్నామని హమాస్ సీనియర్ అధికారి ప్రకటించారు. హమాస్‌తో వివాదానికి సంబంధించి ఇజ్రాయిల్ ప్రభుత్వ ప్రతినిధి డేవిడ్ మెన్సర్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు.

జనావాస ప్రాంతాల్లో ఇజ్రాయిల్ దాష్టీకం

ఇదిలావుండగా, ఒప్పందం కుదిరిందని ప్రకటన వెలువడిన తర్వాత కూడా గాజాలో ఇజ్రాయిల్ ఉధృతంగా దాడులు, దురాగతాలు కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడుల్లో 110మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. వీరిలో 28మంది పిల్లలు, 31మంది మహిళలు వున్నారు.

గాజా నగరంతోపాటూ ఉత్తర సరిహద్దు పట్టణాల్లో జనం ఎక్కువగా వుండే ప్రాంతాలపైనే దాడులు జరుగుతున్నాయి. ఇళ్ల పై కప్పులపై బాంబులను, గ్రెనేడ్లను ఇజ్రాయిల్ క్వాడ్‌కాప్టర్ డ్రోన్లు జారవిడుస్తున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇప్పటివరకు గాజాలో 46,788మంది మరణించగా, 1.10,453మంది గాయపడ్డారు. గత 15మాసాలుగా ఇజ్రాయిల్ భీకరంగా కొనసాగించిన దాడుల్లో రోజుకు కనీసం 15మంది చొప్పున పిల్లలు గాయపడ్డారని, వారిలో చాలామంది వికలాంగులుగా మారారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ పేర్కొంది.

రూ.11,440 కోట్ల ప్యాకేజి

(మొదటిపేజీ తరువాయి)

లాభాల్లో నడిచింది, ప్రస్తుతం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అప్పు రూ.35 వేల కోట్లుగా ఉందని, బ్యాంకు రుణాలు, వడ్డీ, సరుకు సరఫరాకు చెల్లింపులు చేయాల్సి ఉందని మంత్రి కుమార స్వామి తెలిపారు. తొలుత బ్యాంకర్లతో సమీక్షించామని, ప్లాంట్‌కు సహాయ సహకారాలు అందించాలని కోరామన్నారు. అందుకు బ్యాంకులు అంగీకరించలేదని పేర్కొన్నారు. దీంతో కేంద్ర ఆర్థిక మంత్రి, ప్రధాన మంత్రి కార్యాలయంతో చర్చించానని, పిఎంఒతో చర్చల తరువాత సెప్టెంబర్‌లో రూ.500 కోట్లు విడుదల చేశామని, 2024 అక్టోబర్ 9న ఆర్థిక సాయానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అంగీకరించారని తెలిపారు. ఆర్థిక మంత్రి సూచనలతో ఎస్‌బిఐ నేతృత్వంలో కమిటీ వేశామని, కమిటీ నివేదికపై జిఒఎం చర్చల తరువాత రూ.11,440 కోట్ల ప్యాకేజీకి నిర్ణయం జరిగిందని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణను మంత్రివర్గం సవాల్‌గా తీసుకుందని, మూడు ఫర్నేస్‌లతో 92.3 శాతం ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యమని పేర్కొన్నారు. రెండేళ్లలో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను అప్పుల్లో నుంచి బయటకు తేవడమే ప్రథమ కర్తవ్యమని, పూర్తిస్థాయిలో ప్లాంట్ పునరుద్ధరణ తరువాత సెయిల్‌లో విలీనంపై ఆలోచిస్తామని అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని తెలిపారు. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్ర ప్రభుత్వం కాపాడిందన్నారు. కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. కార్మికుల భద్రతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్లాంట్‌ను మరింత సమర్థవంతంగా నడిపించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర రైల్వే, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా మీడియాకు వెల్లడించారు.

రూ.10 వేల కోట్లు అందించాలని నిర్ణయించాం : ప్రధాని మోడీ

ప్రధాని మోడీ ట్విట్టర్ (ఎక్స్)లో ఇలా పేర్కొన్నారు. "విశాఖ ఉక్కుకు ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. రూ.10వేల కోట్లు అందించాలని గురువారం కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నాం. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఈక్విటీ మద్దతును అందించాలని నిర్ణయించాం. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఈ సాయం అందిస్తున్నాం" అని తెలిపారు.

ఇది శాశ్వత పరిష్కారం కాదు : కార్మిక సంఘాలు

స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. ప్యాకేజీతో ప్లాంట్ పునరుద్ధరణ సాధ్యం కాదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పునరుద్ధరించాలనే చిత్తశుద్ధి ఉంటే, సొంత గనులు కేటాయించాలని సూచించారు. లేకపోతే సెయిల్‌లో విలీనమైనా చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ రకంగా ఆలోచన చేయలేదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సొంత గనులు, సెయిల్‌లో విలీనం వంటి శాశ్వత పరిష్కారాల కోసం కార్మికుల పోరాటం జరుగుతోందని, ప్యాకేజీ కోసం కాదని స్పష్టం చేశారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలకు ప్యాకేజీలు ప్రకటించి, ఆ తరువాత మూసివేసిన ఉదాహరణలున్నాయని అన్నారు. రాయబరేలిలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి కూడా ప్యాకేజీ ప్రకటించినట్లే ప్రకటించి, ఆ తరువాత ప్రైవేటుపరం చేశారని గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వం ఇలాంటి కుయుక్తులతో కూడిన చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. రాష్ట్రంలోని టిడిపి, జనసేన పార్టీల మద్దతుతో కేంద్రప్రభుత్వం ఉందని, కనుక వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా చేయాల్సిన బాధ్యత ఆ రెండు పార్టీలపై ఉందని సూచించారు.

వేగంగా కోలుకుంటున్నారు!

- సైఫ్ అలీఖాన్ ఆరోగ్యంపై డాక్టర్లు
- దాడి వెనుక ఎలాంటి అండర్ వరల్డ్ ముఠా లేదు
- దొంగతనమే లక్ష్యమన్న మహారాష్ట్ర మంత్రి

ముంబయి : తన ఇంట్లో గురువారం దుండగుడి కత్తిపోట్లకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలివుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ ఆరోగ్యం ప్రస్తుతం బాగుందని, చాలా వేగంగా కోలుకుంటున్నారని డాక్టర్లు శుక్రవారం తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసే అవకాశం వుందని చెప్పారు. ఆయన ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు డాక్టర్ల బృందం నిశితంగా పర్యవేక్షిస్తున్నందని, తాము అనుకున్నట్లుగానే ఆయన చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే ఇంటికి పంపించేస్తామని లీలావతి ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ నితిన్ డాంగే తెలిపారు. ఇంటెన్సివ్ కేర్ నుండి ఆయనకు స్పెషల్ రూమ్‌కు కూడా తరలించినట్లు చెప్పారు. చేతిపై, మెడపై, వెనుక వెన్నెముకపై మూడు గాయాలయ్యాయని చెప్పారు. మరో 2 మిల్లీమీటర్లు లోతుకు కత్తి వెళ్ళి వున్నట్లైతే ఇంకా తీవ్రంగా గాయమయ్యేదని, అప్పుడు పరిస్థితి కొంచెం క్లిష్టమయ్యేదని డాక్టర్ వ్యాఖ్యానించారు. కాసేపు నడిపించామని, ఆయన కూడా నడవడానికి సౌకర్యంగానే ఫీలయ్యారని చెప్పారు. ఆయన బెడ్‌రెస్ట్‌లో వుండడం మంచిదని సూచించినట్లు చెప్పారు. అందుకే సందర్శకులపై కూడా ఆంక్షలు పెట్టినట్లు తెలిపారు.

ఏ అండర్ వరల్డ్ ముఠా కుట్ర లేదు

ఈ దాడి వెనుక ఏ అండర్ వరల్డ్ ముఠా కుట్ర లేదని, కేవలం దొంగతనానికి పాల్పడాలన్న ఉద్దేశంతోనే ఇదంతా జరిగిందని మహారాష్ట్ర మంత్రి యోగేష్ కదమ్ తెలిపారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో వున్న అనుమానితుడు కూడా ఏ ముఠాకు చెందిన వాడు కాదని అన్నారు. ప్రాథమిక విచారణలో ఈ విషయాలు తేలాయంటూ పూనేలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనకు బెదిరింపులు వస్తున్నాయని సైఫ్ కూడా ఇంతవరకు ఎలాంటి సమాచారం పోలీసులకు ఇవ్వలేదని చెప్పారు. తనకు భద్రత కల్పించాలని కూడా ఆయన కోరలేదన్నారు. సిసి టివి కెమెరాల్లో కనిపించిన వ్యక్తి పోలికలతో సరిపోలుతున్న వ్యక్తిని అనుమానితుడుగా భావించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

అసమానతలు పెంచుతున్న అవినీతి

- పేదలు, అణగారిన తరగతులు, మహిళలపై తీవ్ర ప్రభావం : సిజెఐ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ : అవినీతి అసమానతలకు దారి తీస్తుందని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సంజీవ్‌ఖన్నా అన్నారు. ఇది పేదలు, మహిళలు, అణగారిన వర్గాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు తమ ఆదాయాల్లో అధికశాతం లంచాలకే చెల్లిస్తున్నారన్న అధ్యయనాలను ఆయన ఉటంకించారు. సంపన్నులు, శక్తివంతమైన వ్యక్తులలాగా ఫిర్యాదు చేయలేని కారణంగా ఈ పరిస్థితి ఉన్నదన్నారు. లోక్‌పాల్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అవినీతితో బాధపడుతున్న ప్రజలు ప్రభుత్వ సేవలపై ఎక్కువగా ఆధారపడుతున్న కారణంగా, ముఖ్యంగా మహిళలు అసమాన భారాన్ని మోస్తున్నారని ప్రపంచ బ్యాంకు నివేదికలను ఆయన ఉదహరించారు. పాలనలో అవినీతి, లంచాలు వంటి వాటితో ప్రజలకు ప్రభుత్వంపై విశ్వసనీయత తగ్గుతుందని వివరించారు.

వారిలో అపనమ్మకం పెరుగుతుందనీ, ఇది ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ప్రజా విశ్వాసం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అవినీతిని పరిశీలించటం, పారదర్శకత విషయంలో అవినీతి నిరోధక చట్టం, 1988, సమాచార హక్కు (ఆర్‌టిఐ) చట్టం, 2005లను సిజెఐ కొనియాడారు. లోక్‌పాల్ జస్టిస్ ఎ.ఎం ఖాన్విల్కర్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంజీవ్ ఖన్నాతో పాటు సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎన్.సంతోశ్ హెగ్డె, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, పలువురు సుప్రీంకోర్టు జడ్జిలు హాజరయ్యారు. లోక్‌పాల్ కోసం ఉద్యమించిన సామాజిక కార్యకర్త అన్నా హజారే.. మహారాష్ట్ర నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఆ'భూములపై సమగ్ర అధ్యయనం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 62 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 63 అన్నా క్యాంటీన్లు ప్రారంభించేందుకు ఒక్కో అన్నా క్యాంటిన్‌కు రూ.61 లక్షలతో రూ.38.43 కోట్లతో ఏర్పాటు చేసేందుకు మంత్రి మండలి ఆమోదించింది. గ్రామ వార్డు సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించేందుకు , సిబ్బందిని క్రమబద్ధీకరించేందుకు కూడా మంత్రి మండలి ఆమోదించింది.

ఇవి కాక ...

2024-25 ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యకలాపాలు కొనసాగించేందుకు అవసరమైన నిధులను నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సిడిసి)నుంచి ఎపి మార్క్‌ఫెడ్ అదనపు రుణ సౌకర్యంగా రూ.700కోట్లు తీసుకునేందుకు ప్రభుత్వహామీ పొడిగింపు.

ఎపి ఫెర్రో అల్లాయ్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అభ్యర్ధనపై 31.03.2025 వరకు టారీఫ్, విద్యుత్తు సుంకంలో తగ్గింపు కొనసాగింపు.

నాగావళి నదిపై సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు ఎడమవైపు హెడ్ స్లూయిజ్‌కు ఎడమ వైపు 1.0మెగా వాట్ల మినీ హైడల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన మే ఎన్‌కాన్స్‌ప్రైవేట్ లిమిటెడ్‌కు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ జారీకి ఆమోదం.

తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు ఎడమ స్లూయిజ్‌కు కుడివైపున 2.7మెగా వాట్ల మినీ హైడల్ స్కీమ్‌ను ఏర్పాటు చేసేందుకు మే ఎన్‌కాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీచేసే ప్రతిపాదనకు ఆమోదం.

భవిష్యత్తులో ఏర్పాటు చేసే చిన్న పవర్ ప్లాంట్లలో ఎస్‌ఎహెచ్ జి మహిళలను భాగస్వామ్యం చేయడం

. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామ పరిధిలో ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణా నదికి కుడి మార్జిన్‌లో 0.9 కిలో మీటర్ల నుంచి 2.61 కిలో మీటర్ల వరకు వరద రక్షణ గోడ నిర్మాణ పనులకు రూ.294.20 కోట్లతో పరిపాలన అనుమతి.

ఈ నిర్మాణం వల్ల సుందరయ్యనగర్, మహానాడు కాలనీ ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా నివారణ.

పి-4 పద్మవ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిల్లో సంస్థాగత ఏర్పాట్లు ప్రత్యేకంగా ఉంటాయి.

నష్టాలు రైతులకు బదిలీ

ఇప్పటి వరకు ఉన్న 'పిపిపి' విధానం సంప్రదాయకమైనదని, 'పిపిపిపి' అధునాతనమైనదని పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లో సర్కారు తెలిపింది. పి-3లో ప్రాజెక్టుకు నష్టాలొస్తే ప్రభుత్వం, ప్రైవేటు సంస్థ భరించేవి. వైఫల్యాల బాధ్యత చాలా మట్టుకు ప్రైవేటుకే చెందుతాయి. ప్రజలకు అంతగా సంబంధం ఉండదు. అదే పి-4లో అయితే రైతులు భూములను పెట్టుబడిగా పెడతారు కాబట్టి వాటాదారులవుతారు. నష్టాలు భూములిచ్చిన రైతులకూ బదిలీ అవుతాయి. అంటే రైతులు భూములను కోల్పోవడంతో పాటు ప్రాజెక్టు నష్టాలనూ భరించాలి. ఆ ప్రాజెక్టుకు ఇచ్చిన భూములు రైతులకు అంత సులభంగా తిరిగి రావు. వచ్చినా వ్యవసాయానికి ఉపయోగపడవు. రెండందాల రైతులకు నష్టం. కాగా రైతులు షేర్ హోల్డర్లని, స్టేక్ హోల్డర్లని, లాభాల పంపిణీ అని, యాజమాన్య బోర్డులో ప్రాతినిధ్యమని, ఓటింగ్ రైట్ అని చేదు గుళికలకు పంచదార పూత పూసిన మాదిరి వల్లించారు.

మూడు రోల్ మోడల్స్

పి-4 విధానం సక్సెస్ స్టోరీలుగా మూడు ఉదాహరణలను ముందుపెట్టింది ప్రభుత్వం. వాటిలో మొదటిది అమరావతి కేపిటల్ సిటీ. మొదటి 'పి' అంటే రైతులు. రెండవ 'పి' అంటే సిఆర్‌డిఎ, మూడవ 'పి' అంటే అంతర్జాతీయ సంస్థలు, నాల్గవ 'పి' అంటే వాటి మధ్య పార్టనర్‌షిప్. దాదాపు 25 వేల మంది రైతుల నుంచి 34 వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్, అభివృద్ధి చేసిన 63 వేల ప్లాట్లు, 6.84 చదరపు కిలోమీటర్ల సిటీ నిర్మాణం. ప్రాజెక్టు విలువ రూ.51 వేల కోట్లు. రైతులకు భూమిపై లాభాలు, ఆ ప్రాంత ప్రజలందరి సామాజిక, ఆర్థిక అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. కానీ నేటికీ భూములిచ్చిన రైతుల మనోవ్యథ చెప్పనలవికాదు. ప్రభుత్వం మారినప్పుడు ఏం జరిగిందో కళ్లముందు కనిపిస్తుంది. ఇక రెండవ సక్సెస్ స్టోరీ అమెరికాలో న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్ మైక్రో గ్రిడ్. 2030 నాటికి న్యూయార్క్ నగర విద్యుత్ వినియోగంలో 50 శాతం సంప్రదాయేతర ఇంధనం కిందికి తీసుకురావాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసింది. దీనిలో ప్రజలు తమ ఇళ్లపై సోలార్ ప్యానల్స్ అమర్చుకుంటారు. ఆ విధంగా ఉత్పత్తయిన సోలార్ విద్యుత్‌ను తాము వాడుకొని మిగతా విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇస్తారు. దీనిలో ప్రైవేటు సంస్థ క్లౌడ్ బేస్డ్ టెక్నాలజీతో గ్రిడ్‌ను నిర్వహిస్తుంది. ఇది పైలెట్ ప్రాజెక్టు మాత్రమే. అర్బన్ ప్రాంతాలకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంది. మూడవ సక్సెస్ స్టోరీ మహారాష్ట్రలో పూణెలోని మంగార్‌పట్టా సిటీ. ఇది పక్కా రియల్ ఎస్టేట్ దందా. 430 ఎకరాల విస్తీర్ణం. దీనిలో 800 మంది నేరుగా లబ్ధిపొందేవారు. భూములిచ్చిన వారికి ఐదు రెట్ల ఆదాయం వస్తుందని ప్రాజెక్టులో అంచనా వేశారు. అమ్మకాల్లో షేర్ వస్తుందన్నారు.





మీకోసం

సాధారణ దగ్గు తగ్గాలంటే, వేడినీటిలో స్పూన్ అల్లం, నిమ్మ రసాన్ని కలిపి తాగాలి.

జీవన సౌరభం

ప్రయత్నాన్ని, విజయాన్ని అడ్డుకునేది ప్రతికూల భావాలే. వాటిని ఎంత దూరం పెడితే విజయం అంత దగ్గర ..



విద్యార్థులం



విద్యార్థులం, విద్యకు అర్థులం
వినయ సంపన్నులం
వివేక దివ్వెలం
గుణ కోవిదులం
జ్ఞాన అర్వులం

బుడిబుడి నడకల పిల్లలం
చిచ్చర పిడుగులం
బంగరు భవితకు వారసులం
పుస్తక ప్రియులం
మస్తిష్క మదనపరులం
రాబోవు కాలానికి
కాబోవు నాయకులం

సాహసాల స్వప్నికులం
వీరరసాల వీరులం
కరుణరస కుమారులం
ముద్దుల మువ్వలం


జీవిత రణరంగ కదనపరులం

క్రమశిక్షణ కార్ఖానాలం
ఆకాశమంత ఆశవాదులం
నిరాశ తిమిరం
పారద్రోలే సూర్యులం
కాలం చేతిలో కాగడాలం
విశ్వవిహారకులం

సమతా సమాజ సాకారులం
సౌభ్రాతృత్వ భావుకులం!
విశ్వమానవ ప్రేమికులం
విశాల భావన అనుచరులం!

- రాళ్లబండి సంగం నాయుడు,
జరజాపుపేట, నెల్లిమర్ల,
విజయనగరం,
94909 35258.

సరైన దారి ఏది



పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న పక్షిని ఎవరు సరిగ్గా చూస్తున్నారో, ఆ దారిని కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



ఎ.శృతి, 8వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్, దూలిమిట్ట,
సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అక్కడ.. ఆమె మాయమైపోతోంది!

మౌఢ్యం నిండిన మనుషులతో నిండిపోయిన సమాజంలో భిన్న జాతులు మనుగడ సాగించలేవు. నిత్యం ఆధిక్య జాతి, నిమ్న జాతిని అణిచివేయాలని, నాశనం చేయాలని తలపోస్తూ ఉంటుంది. ప్రస్తుతం తాలిబన్ల రాజ్యంలో అదే జరుగుతోంది. అక్కడ మహిళలకు నిలువ నీడ లేదు. రానురాను వారి ఉనికి ప్రశ్నార్థకమైపోతోంది.



ఈ సమాజం విభిన్న జాతులు, మతాల సమ్మేళనం. అందులో స్త్రీ, పురుషులు సమాన హక్కులతో ఎదగాలి. గౌరవింపబడాలి. కానీ మతం పేరుతో మూర్ఖత్వం పెరిగిపోయిన ఛాందస వాదులు స్త్రీలను సమాన జాతిగా పరిగణించరు. ఆచారం పేరుతో ఆమెపై ఆంక్షలు విధిస్తారు. విద్య, ఉపాధి నుండి ఆమెని దూరం చేస్తారు. ఈ పోకడలు సమాజంలో ఎంతటి విషమ పరిస్థితులు తీసుకొస్తున్నాయో ఆఫ్ఘన్ దేశాన్ని చూస్తే అర్థమౌతుంది. తాలిబన్లు హస్తగతమైన ఆఫ్ఘన్‌లో ఇప్పుడు మహిళలు చదువుకునే హక్కు లేదు. ఉద్యోగం చేసుకునే అర్హత లేదు. మహిళలపై తాలిబన్లు గంపగుత్తుగా విధిస్తున్న నియమ నిబంధనల్లో తాజాగా వైద్య సిబ్బంది విధుల నుండి ఆమెని దూరం చేసారు.

ఇక ఆమె ఆస్పత్రికి వెళ్లలేదు..

25 ఏళ్ల సారా ఇద్దరు బిడ్డల తల్లి. ఆఫ్ఘన్ మారుమూల జిల్లా బమ్యాన్‌లో ఉంటోంది. తను రక్తహీనతతో బాధపడుతోంది. చికిత్స కోసం తరచూ స్థానిక స్వచ్ఛంద సంస్థ నిర్వహించే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి వెళుతుంది. అక్కడ మిడ్‌వైఫ్ నజీబా ఆమెని సంరక్షిస్తుంది. అవసరమైన వైద్యం అందిస్తుంది. ఈ సేవకు గాను సంస్థ నుండి నజీబాకి ఆదాయం లభిస్తుంది. ఆ సొమ్మే ఆమె కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరు. కానీ ఇప్పుడు తాజాగా తాలిబన్లు విధించిన ఆంక్షలతో నజీబా విధులకు హాజరు కాలేదు. మరోపక్క అక్కడ మహిళా వైద్యురాలు లేనందున సారా చికిత్సకు రాదు. ఈ నిబంధన ఇద్దరు మహిళల ఆరోగ్యం, ఆదాయంపై పెద్ద ప్రభావాన్ని తీసుకొచ్చింది. ఇలాంటి మహిళలు తాలిబన్లో ఇప్పుడు ఎక్కడ చూసినా కనిపిస్తారు.

భవిష్యత్తు లేక..

తాజా ఆంక్ష ప్రకారం 'వైద్య విద్య అభ్యసిస్తున్న మహిళలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో మిడ్‌వైఫ్ కోర్సులు అభ్యసిస్తున్న మహిళలను ఇకనుండి శిక్షణ తీసుకోకూడదని తాలిబన్లు హుకుం జారీచేశారు. ఈ ఆంక్ష జారీ చేశారని తెలియగానే అమ్రీన్ కాళ్ల కింద భూమి కంపించినట్లు వణికి పోయింది. గతేడాది డిసెంబరులోనే ఆమె మిడ్‌వైఫ్ కోర్సును పూర్తి చేసింది. ఉపాధి కోసం ఎదురు చూస్తోంది. 'నేను ఉద్యోగం చేసి కుటుంబానికి సాయంగా ఉండాలని అనుకున్నాను. ఇప్పుడు నా పరిస్థితి తలకిందులైంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. తాలిబన్లు వచ్చిన దగ్గర నుండి మహిళలు తమ హక్కుల నుండి దూరమౌతూనే ఉన్నారు' అని ఆమె వాపోతోంది.

ఆ నొప్పి నుండి ఎలా బయటపడాలి..

'ఉన్నత విద్య, వైద్య విద్య నుండి మహిళలను దూరం పెడితే మేం ఎలా జీవించాలి? ఎలా బతకాలి? ఆరోగ్యం, ప్రసూతి సేవల నుండి దూరమైతే భవిష్యత్తులో మా పరిస్థితి ఏంటి? ఆఫ్ఘన్‌లో పుట్టబోయే బిడ్డలను ఎవరు రక్షిస్తారు? ప్రసవ వేదన నుండి మమ్మల్ని మేం ఎలా కాపాడుకోవాలి? ఇక నుండి మాకు బతికే హక్కు లేదా?' అని నీళ్లు నిండిన కళ్లతో అమ్రీన్ ప్రశ్నిస్తోంది. ఈ ఆవేదన అక్కడ ఎందరో మహిళలది.

'ప్రపంచంలోనే అత్యధిక ప్రసూతి మరణాల రేటు గల దేశం ఆఫ్ఘన్. అక్కడ వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతాయి. ఇప్పుడు మహిళా ఆరోగ్యసిబ్బంది కొరత ఈ పరిస్థితిని మరింత దిగజారుస్తుంది' అంటున్నారు ఆఫ్ఘన్ ఎంఎస్ఎఫ్ ప్రతినిధి మైకేల్ లే పైప్.



ప్రస్తుతం ఆఫ్ఘన్ వైద్యసేవల్లో దాదాపు 1500 మంది మహిళలు మెయిన్‌స్ట్రీమ్ బాధ్యతల్లో ఉన్నారు. పీడియాట్రిక్, ప్రసూతి ఆరోగ్య కార్యక్రమాలు వంటి వాటిల్లో పనిచేసే కార్మికుల్లో కూడా మహిళల సంఖ్య గణనీయంగా ఉంది. 'రోగుల్లో మహిళలు, పిల్లలు ఎక్కువగా ఉంటారు. కాబట్టి ఈ సేవల్లో మహిళా సిబ్బంది ప్రమేయం చాలా ముఖ్యం. ఇప్పుడు జారీ చేసిన ఈ డిక్రీ ఆరోగ్య వ్యవస్థను పెను ప్రమాదంలో పడేస్తుం'దని ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు భయపడుతున్నారు.

నర్సింగ్ విద్య అభ్యసిస్తున్న మరో విద్యార్థి తన అనుభవాన్ని ఇలా చెబుతోంది. 'నిషేధం విధించినప్పుడు ఎందరో మహిళలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేశారు. 'లక్ష్యంలేనిది', 'నిరాశ్రయమైనది' అన్న నినాదాలు రాసిన ప్లకార్డులు పట్టుకుని నల్ల బురఖాలు ధరించిన యువతులు గొంతెత్తి అరిచార'ని ఆ యువతి గుర్తుచేసుకుంది.


డిసెంబరు 29న జారీచేసిన ఈ డిక్రీ అమలైతే భవిష్యత్తులో సమాజం నుండి మహిళలను పూర్తిగా తుడిచిపెట్టడమే అవుతుందని అక్కడి మహిళలు భయపడుతున్నారు. సమాజం నుండి, ప్రజా ప్రపంచం నుండే కాక, ఒకరి నుండి ఒకరు దూరమయ్యేలా తాలిబన్ల ఆంక్షలు అమలౌతున్నాయి.

మతధర్మం పేరుతో దారుణాలు..

ఆఫ్ఘన్-బ్రిటీష్ కార్యకర్త షబ్నమ్ నజిమి డిసెంబరు 13న వెల్లడించిన వాస్తవాలు ఒకసారి చూద్దాం. 'ఆఫ్ఘన్‌లో బాలికలు విద్య నుండి దూరమై ఇప్పటికి 1182 రోజులు. విశ్వవిద్యాలయాల నుండి దూరమై 724 రోజులు. ప్రతి రోజూ ఒక తరం మహిళలు, బాలికలు వారి హక్కులను కోల్పోతూనే ఉన్నారు. 'ధర్మాన్ని రక్షించాలి.. దుర్గుణాలను నివారించాలి' అని తాలిబన్లు తెచ్చిన చట్టం, మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను భగ్నం చేసింది. వాళ్ల నైతికతను ప్రశ్నిస్తోంది. ఈ చట్టం తెచ్చినప్పటి నుండి, వాళ్లు ధరించే దుస్తులపైనే కాదు, వాళ్లు 'ఎవరితో మాట్లాడాలి, ఎవరిని చూడాలి' అనే విషయాలపై కూడా ఆంక్షలు వచ్చాయి. ఇంటి వంటగదికి ఉన్న కిటికీల నిర్మాణాలను తొలగించాలన్న మూర్ఖపు ఆంక్షలు అక్కడ అమలౌతున్నాయి. స్వచ్ఛంధ సంస్థల్లో మహిళలు పనిచేయడంపై నిషేధం విధించినప్పటి నుండి సాయం అందక ఎందరో మహిళలు ఆకలితో అల్లాడిపోతున్నారు. ఇది వారికి మరణ శిక్షతో సమానం'.

ఆఫ్ఘన్ తాలిబన్ల వశం అయినప్పటి నుండి ఇప్పటివరకు మహిళలు, బాలికలపై 70 శాసనాలు, ఆదేశాలు, డిక్రీలు అమలుచేశారు. ఇవి వారి ప్రాథమిక హక్కులన్నింటినీ తొలగించాయి. ఇదే పరిస్థితి కొనసాగితే అక్కడ ఆమె మాయమై పోతుంది. పూర్తిగా నాశనమైపోతుంది.

'హరిహర వీరమల్లు' ఫస్ట్ సింగిల్ విడుదల



కథానాయకుడు పవన్‌కళ్యాణ్ నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు' నుంచి ఫస్ట్ సింగిల్‌సాంగ్‌ను మేకర్లు శుక్రవారం విడుదల చేశారు. 'వినాలి... వీరమల్లు మాట చెబితే వినాలి' అంటూ ఈ పాట సాగుతుంది. గతంలో 11 సెకన్ల పాటు సాగిన ఫస్ట్‌గ్లింప్స్ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉంది. 'మాట వినాలి.. గురుడా మాట వినాలి.. మంచి మాట వినాలి' అంటూ పవన్ పాడిన పాటను విడుదల చేయటంతో ఈ పాట కూడా నెట్టింట వైరల్ అవుతోంది. తొలుత ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. దాదాపు 50 శాతం సినిమా ఆయనే పూర్తిచేశారు. మధ్యలో ఆయన విరమించుకోవటంతో ప్రస్తుతం జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పీరియాడిక్ సినిమాగా తెరకెక్కుతోంది. ఎన్నికల అనంతరం ఇప్పటికే రెండు, మూడు షెడ్యూళ్లు కొనసాగాయి. తుది షెడ్యూల్‌లో భాగంగా షూటింగ్ అడపా దడపా కొనసాగుతోంది. ఇటీవల విజయవాడలో ఏకధాటిగా కొన్ని రోజులపాటు చిత్రీకరణ కొనసాగింది. పాన్ ఇండియా స్థాయిలో ఐదుభాషల్లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ క్రమంలో మొదటి గీతాన్ని తెలుగులో మాట వినాలి, తమిళంలో కెక్కనుం గురువే, మలయాళంలో కేల్క్కనం గురువే, కన్నడలో మాతు కేలయ్యా, హిందీలో బాత్ నిరాలిగా విడుదల చేశారు. కీరవాణి సంగీతాన్ని అందించారు. తెలుగులో పెంచల్‌దాస్, తమిళంలో పిఎ విజయ్, మలయాళంలో మంకొంబు గోపాలకృష్ణన్, కన్నడలో ఆజాద్ వరదరాజ్, హిందీలో అబ్బాస్ టైరేవాలా సాహిత్యాన్ని అందించారు. 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. పవన్ కళ్యాణ్‌తో పాటుగా బాబీ డియోల్, నిధి అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి వంటి ప్రముఖులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మార్చి 28న ఈ సినిమా విడుదల కానుంది. సూర్య మూవీస్ బ్యానర్‌పై ఎఎం రత్నం నిర్మిస్తున్నారు.

అవకాశాలొస్తేనే నటిస్తా : శిల్పాశెట్టి



'నేను మొదటి నుంచి కష్టపడి పనిచేశా. మంచి అవకాశాలొచ్చాయి. దానికి సంతృప్తిగా ఉన్నా. అవకాశాల కోసం ఆడిషన్స్ ఇచ్చే పరిస్థితిలో లేను. హాలీవుడ్ కోసమో, మరో చోటో ఆఫర్ల కోసం ఆడిషన్స్‌కు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. మూడు దశాబ్దాలపాటు సాగిన నా కెరీర్‌లో ఎన్నో సినిమాలు విమర్శకుల నుంచి ప్రశంసలు పొందాయి. ఇలా 30 ఏళ్ల పని తర్వాత కొత్తగా ఆడిషన్స్ పాల్గొనే ఓపిక నాకు లేదు. నా టాలెంట్ గురించి తెలుసుకోవాలంటే గత చిత్రాలను చూడండి. నేను సరిగ్గా సరిపోతుంటే ఆడిషన్ చేయాల్సిన అవసరం లేదు. ఏదేమైనా నా జీవితంలో కుటుంబానికి మొదటిస్థానం. పని కోసమో మరింత పేరు ప్రతిష్ఠల కోసమో ఆరాటపడుతూ ఎక్కువ కాలం పిల్లలకు దూరంగా ఉండటం నా వల్ల కాదు' అని బాలీవుడ్ కథానాయిక శిల్పాశెట్టి కుంద్రా అన్నారు. బాజీఘర్ లాంటి బాక్సాఫీస్ హిట్స్ ఇచ్చిన శిల్పాశెట్టికి బాలీవుడ్‌లో స్టార్‌డమ్ దక్కలేదు. ఉత్తరాది కథానాయికల్లో తక్కువమందికే సాధ్యమైన విధంగా టాలీవుడ్ సహా దక్షిణాదిలో చెప్పుకోదగ్గ సంఖ్యలోనే సినిమాలు చేసినా ఇక్కడా పెద్ద పేరు రాలేదు. వెంకటేష్‌తో సాహసవీరుడు సాగరకన్య, నాగార్జునతో ఆజాద్, వీడెవడండీ బాబు వంటి పలు తెలుగు సినిమాల్లో నటించారు. నేటికీ అడపా దడపా సినిమాలు చేస్తూనే ఉన్నారు.



నాగచైతన్య చేపలపులుసు అదుర్స్

అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి నటీనటులుగా నటిస్తున్న సినిమా 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో మత్స్యకారుడిగా చైతన్య నటిస్తున్నారు. ఇప్పటికే వారి జీవితాలను దగ్గరగా చూసిన ఆయన ఆ పాత్రలో ఇమిడిపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. షూటింగ్ ప్రారంభంలో మత్స్యకారులకు తాను చేపల కూర వండిపెడతానని హామీ ఇచ్చారట. దానిలో భాగంగానే కట్టెల పొయ్యిపై చేపలపులుసు కూర వండి వడ్డించారు. తాను కూడా వారితో కలిసి భోజనం చేసి సందడి చేశారు. తొలిసారి ఏదో ఇలా తనకు తెలిసినట్లుగా చేశాను. ఏమీ అనుకోవద్దంటూ కోరాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమా ఫిబ్రవరి ఏడోతేదీన విడుదల కానుంది.

షాహిద్ సినిమాలో



బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ చిత్రంలో పూజా హెగ్డే నటిస్తోంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తెలిపింది. షాహిద్ కపూర్ 'దేవా' మూవీలో దియాగా నటిస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోస్ట్ చేసింది. పోస్ట్‌తో పాటు 'దేవా' ట్రైలర్‌ను కూడా షేర్ చేసింది. షాహిద్ ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నాడు. ఈ మూవీకి రోషన్ ఆండ్రూస్ దర్శకత్వం వహస్తున్నారు. పావైల్ గులాటీ, విశాల్ మిశ్రా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జీ స్టూడియోస్, రాయ్ కపూర్ ఫిల్మ్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 31న థియేటర్లలో విడుదల కానుంది.

పుష్ప సినిమాలో నటిస్తానని చెప్పా




టాలీవుడ్ డైరెక్టర్ సుకుమార్ కూతురు సుకృతి వేణి లీడ్ రోల్‌లో నటించిన డెబ్యూ చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుకుమార్ రైటింగ్స్ బ్యానర్-గోపీటాకీస్‌తో కలిసి నవీన్ యేర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మించారు. తబితా సుకుమార్ సమర్పిస్తున్న ఈ మూవీ జనవరి 24న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రబృందం తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా సుకృతి మాట్లాడుతూ, 'చిన్నప్పటి నుండి నటించడం చాలా ఇష్టం. నాన్న సినిమాల్లో నటిస్తానని చాలాసార్లు అడిగాను. పుష్ప, పుష్ప 2కి కూడా అడిగాను. 'నా టీచర్స్, స్నేహితులు, తెలిసినోళ్లందరూ నువ్వు పుష్పలో నటిస్తున్నావా' అని అడిగేవారు. అప్పుడు మాత్రం 'చేస్తలేను నాకు చేయబుద్ధి అవ్వలేదు. ఎందుకంటే నేను సుకుమార్ పాపను కదా.. అందుకే పెట్టినారు అనుకుంటారు' అన్నా. కానీ అసలు విషయమేంటంటే.. డాడీని పుష్పలో యాక్ట్ చేస్తా అని అడిగితే.. ఆడిషన్ చెయ్.. చూద్దాం అన్నారని సమాధానమిచ్చింది.

ఖేల్‌రత్న అవార్డులు అందుకున్న

మను, గుకేశ్, హర్మన్, ప్రవీణ్

- 32మందికి అర్జున అవార్డుతో సత్కారం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్పోర్ట్స్ అవార్డుల ప్రదానం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఖేల్‌రత్న అవార్డులు అందుకుంటున్న గుకేశ్, హర్మన్‌ప్రీత్, ప్రవీణ్, మను

న్యూఢిల్లీ: జాతీయ స్పోర్ట్స్ అవార్డుల ప్రదానం రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం అట్టహాసంగా జరిగింది. దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డులను ఈ ఏడాది నలుగురు అథ్లెట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకున్నారు. ఖేల్‌రత్న అవార్డులు అందుకున్న వారిలో పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు కొల్లగొట్టిన యువ మహిళా షూటర్ మను బకర్‌తోపాటు ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేశ్, రెండుసార్లు ఒలింపిక్స్‌లో భారత హాకీజట్టు కాంస్య పతకాలు సాధించడంలో కీలకపాత్ర పోషించిన హర్మన్‌ప్రీత్ సింగ్, పారా ఒలింపిక్స్ హైజంపర్ ప్రవీణ్ కుమార్ ఉన్నారు. 22ఏళ్ల మను బకర్ గత ఏడాది ఆగస్టులో జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో 10మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంపాటు 10మీ. ఎయిర్ స్టిల్ మిక్స్‌డ్ టీం విభాగాల్లో కాంస్య పతకాలను సాధించింది. ఈ క్రమంలో ఒక ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి మహిళా అథ్లెట్‌గా బకర్ చరిత్ర సృష్టించింది. ఇక 18ఏళ్ల గుకేశ్.. 2024 డిసెంబర్‌లో జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. దీంతో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన భారత రెండో గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ రికార్డుల్లోకెక్కాడు. అలాగే చెస్ ఒలింపియాడ్‌లోనూ భారత పురుషుల జట్టు బంగారు పతకం సాధించడంలోనూ గుకేశ్ కీలకపాత్ర పోషించాడు. వీరితోపాటు 32మంది అథ్లెట్లు రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డులు అందుకున్నారు. వీరిలో 17మంది పారా అథ్లెట్లు ఉన్నారు. తొలి పారా ఒలింపిక్ స్వర్ణ పతక విజేత మురళీకాంత్ పేట్కర్, సచ్చా సింగ్‌లకు జీవితకాల సాఫల్య అర్జున అవార్డుతో ఘనంగా సత్కరించారు. వీరితోపాటు నలుగురికి ద్రోణాచార్య, ఇద్దరికి లైఫ్‌టైమ్ కేటగిరీ, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ అందజేశారు. మౌలానా అబుల్ కలామ్ అజాద్ ట్రోఫీ ఓవరాల్ విజేతగా ఛండీగర్ యూనివర్శిటీకి, తొలి రన్నరప్ లౌల్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీ, రెండో రన్నరర్‌గా అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్శిటీలకు సర్టిఫికెట్లు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు.

తెలుగు రాష్ట్రాలకు చెందిన జ్యోతి యర్రాజి, దీప్తి జీవాంజి రాష్ట్రపతి చేతుల మీదుగా అర్జున పురస్కారాలను అందుకున్నారు. జ్యోతి యర్రాజి గత ఏడాది 100మీ. హార్డిల్స్‌లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి మహిళా అథ్లెట్‌గా నిలిచింది. ఇక దీప్తి 400మీ. టి-20క్లాస్ పారా ఒలింపిక్స్‌లో పతకంతో మెరిసింది.



సెమీస్‌కు భారతజట్లు

ఖోఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: ఖోఖో ప్రపంచకప్ ఫైనల్లోకి భారత జట్లు దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారతజట్లు ఏకపక్ష పోరులో ప్రత్యర్ధి జట్లను చిత్తుచేశాయి. ముఖ్యంగా భారత మహిళలజట్టు క్వార్టర్‌ఫైనల్లో 109-14పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. కెప్టెన్ ప్రియాంక అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఖోఖో ప్రపంచకప్ పోటీల్లో వారం రోజులుగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇక భారత పురుషుల జట్టు 100-40పాయింట్ల తేడాతో శ్రీలంకను చిత్తుచేసింది. ఇతర క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో ఇరాన్ జట్టు 86-18పాయింట్ల తేడాతో కెన్యాను ఓడించి సెమీస్‌కు చేరగా.. మహిళల విభాగంలో ఉగాండా జట్టు 71-26పాయింట్ల తేడాతో న్యూజిలాండ్‌ను, దక్షిణాఫ్రికా జట్టు హోరాహోరీ పోరులో 51-46పాయింట్ల తేడాతో కెన్యాను ఓడించి సెమీస్‌కు చేరాయి.

ప్రి క్వార్టర్స్‌కు సబలెంక, గాఫ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



ప్రి క్వార్టర్స్‌కు చేరిన గాఫ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, అమెరికా యువ సంచలనం కోకా గాఫ్ ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మూడోరౌండ్ పోటీలో వీరు వరుససెట్లలో ప్రత్యర్థులను చిత్తుచేశారు. గాఫ్ 6-4, 6-2తో కెనడాకు చెందిన 30వ సీడ్ ఫెర్నాండెజ్‌పై సునాయాసంగా విజయం సాధించింది. ఇక సబలెంక 7-6(7-5), 6-4తో టాసన్(డెన్మార్క్)పై పోరాడి నెగ్గింది. ఇతర పోటీల్లో 7వ సీడ్ పెగూల(అమెరికా) 7-6(7-3), 6-1తో డానిలోవిక్ (క్రొయేషియా), 14వ సీడ్ రష్యాకు చెందిన ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్(పోలండ్)ను చిత్తుచేసింది.

జకో జోరు..

పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన మూడోరౌండ్ పోటీలో జకోవిచ్ 6-1, 6-4, 6-4తో 26వ సీడ్ మఛాక్(చెక్)ను చిత్తుచేశాడు. మరో పోటీలో 2వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ) 6-3, 6-4, 6-4తో ఫర్నిలే(బ్రిటన్)ను చిత్తుచేశాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బొప్పన్న-జంగ్(చైనా) జంట రెండోరౌండ్‌కు చేరింది. తొలిరౌండ్‌లో వీరు 6-4, 6-4తో క్రొయేషియా-ఫ్రాన్స్ జంటను ఓడించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68